

ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్

బాలిక వ్యవహారంలో ఇద్దరిపై కేసు నమోదు

పీలేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలానికి చెందిన బాలిక వ్యవహారంలో కేవీ పల్లె పోలీసులు శుక్రవారం రాత్రి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఐసీడీఎస్ పీలేరు ప్రాజెక్టు సీడీపీవో రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై బాలికను గర్భవతిని చేసిన ఆమె సమీప బంధువు అయిన వీరశెట్టి నరేంద్ర, బాలికకు కాన్పు చేయడమే కాకుండా ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయనందుకు పీలేరుకు చెందిన మాధవి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ మాధవిపై కేసు (ఎఫ్ఐఆర్ నెం.92/2025) నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మాధవి ఆసుపత్రిలో శుక్రవారం సాయంత్రం తమ సంరక్షణలోకి తీసుకున్న శిశువును రాయచోటిలోని శిశు గృహ కేంద్రానికి అప్పగించినట్లు సీడీపీవో రాజమ్మ శనివారం తెలిపారు.

ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమంతో రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యమని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకత పెంచడం ఎక్కువ భూమిని సాగులోకి తీసుకురావడం పంట రుణాలను రైతులందరికీ చేరవేయడమే లక్ష్యంగా ఈ పథకం అమలవుతుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కేవలం 16 శాతం మాత్రమే సాగు చేయబడిందని, దీనికి ప్రధాన కారణం వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (ఇన్‌చార్జి) మజీద్ అహ్మద్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి, పీడీ ఏపీఎంఐపీ లక్ష్మీప్రసన్న, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, నాబార్డు అధికారి విజయ విహారి, ఎల్డీయం అంజనేయులు, జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్, మత్స్యశాఖ అధికారి సుశ్మిత, జిల్లా సాగునీటి శాఖాధికారి సాయిరాంప్రసాద్, ప్రకృతి వ్యవసాయ రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించకుంటే చర్యలు

- ముమ్మరంగా ఆహార భద్రతా విభాగం తనిఖీలు
- 7 హోటళ్లకు నోటీసులు జారీ



తాజ్ హోటల్ వంటగదిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

రాయచోటిటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లను శనివారం ఆహార భద్రతా విభాగం అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని 13 హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు, పారిశుధ్య పరిస్థితులపై తనిఖీ చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేసి వంట గదిలో పరిశుభ్రత పాటించని 7 హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. వంట గది, భోజన టేబుల్స్‌తో పాటు హోటల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ కూడా పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తరిగొండ నరసింహస్వామి

గుర్రంకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను నిర్వహించా రు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తు లు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణలో ఏం చెప్పాడో...!

- జనార్దన్‌రావు సన్నిహితుల్లో హైటెన్షన్
- సర్వత్రా ఉత్కంఠ
- జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ కలీం అష్రఫ్ అరెస్టు
- ముడిపదార్థాలు పంపిన బాలాజీ, సుదర్శన్ కోసం గాలింపు
- పోలీసుల అదుపులో జనార్దన్‌రావు, హైదరాబాదుకు చెందిన రవి





తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఎస్కార్ట్ వాహన డ్రైవర్ కలీం అష్రఫ్

ములకలచెరువులో పట్టుబడ్డ నకిలీ మద్యం, బాటిల్‌పై అతికించే స్టిక్కర్లు

ములకలచెరువు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కేంద్రంగా సాగిన నకిలీ మద్యం తయారీలో పట్టుబడ్డ ఏ1 మద్దేపల్లి జనార్దన్‌రావు ఏం చెప్పాడోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టులో జనార్దన్‌రావును శుక్రవారం అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు రహస్య ప్రాంతానికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనను దాదాపు 10 గంటలకు పైగా విచారించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ములకలచెరువుతో పాటు ఇబ్రహీం పట్నంలో పట్టుబడ్డ నకిలీ మద్యం తయారీ యూనిట్లకు సంబంధించి జనార్దన్‌రావు ప్రధాన నిందితుడు. విచారణలో ఆయన కీలక విషయాలను వెల్లడించినట్లు సమాచారం. దీంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో జనార్దన్‌రావుతో సన్నిహితంగా మెలిగిన ఇక్కడి ముఖ్య నేతల్లో టెన్షన్ నెలకొంది.

2024 సార్వత్రిక ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఎన్నికల లావాదేవీలు జనార్దన్‌రావు చేశాడు. అప్పట్లో ఆయనకు పలువురి నేతలతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. జనార్దన్‌రావుతో కలిసిమెలిసి తిరిగిన నేతలకు నకిలీ మద్యం తయారీ వ్యవహారం తెలుసునని ఈ ప్రాంతంలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తుండడంతో ఇక్కడి నేతల్లో టెన్షన్ నెలకొంది. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించి అరెస్టుల పర్వం కొనసాగుతోంది. తాజాగా జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహన డ్రైవరైన ములకలచెరువుకు చెందిన సయ్యద్ కలీం అష్రఫ్ (22)ను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె కోర్టు జడ్జి రెండు రోజుల పాటు సెలవులో ఉండడంతో తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరుపరిచారు. దీంతో అతడికి ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ములకలచెరువు మద్యం తయారీకి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి భారీ ఎత్తున స్పిరిట్, ముడి పదార్థాలు పంపిన బాలాజీ, ఆయన కుమారుడు సుదర్శన్ కోసం బెంగళూరులో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావుతో పాటు ఇక్కడికి హైదరాబాదు నుంచి నకిలీ స్టిక్కర్లు పంపిన నకిరికంటి రవిని ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిని కలిసి అరెస్టు చూపే అవకాశం ఉంది. కేసులో మిగిలిన నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలు బెంగళూరులో గాలిస్తున్నాయి.

డ్రైవర్ అష్రఫ్ ఇచ్చిన వాంగ్మూలం ఇదే...

ములకలచెరువు మద్యం కేసులో అరెస్టయిన జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ ఏ-21 అష్రఫ్ రిమాండ్ రిపోర్టులో పలు విషయాలు ఉన్నాయి. 2024 ఎన్నికల సమయంలో జయచంద్రారెడ్డికి చెందిన నల్ల రంగు స్కార్పియో డ్రైవర్‌గా ఆరు నెలలు పనిచేశానని, ఆ సమయంలో జయచంద్రారెడ్డి స్నేహితుడైన జనార్దన్‌రావుతో పరిచయాలు ఏర్పడ్డాయని తెలిపాడు. తర్వాత కొన్ని కారణాల వల్ల తనను డ్రైవర్‌గా తీసేయడంతో ములకలచెరువు మార్కెట్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడినని చెప్పాడు. జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డి మద్యం షాపులో గానీ క్వారీలో గానీ పని కల్పిస్తామని చెప్పాడని, అలాగే జనార్దన్‌రావును కూడా తనకు పని కల్పించాలని అడగ్గా ప్రతి రెండు, మూడు రోజులకొకసారి స్కార్పియోలో బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం సరఫరా చేయమని చెప్పాడని, అందుకు కేసులో ఏ2 కట్టా రాజు ప్రతిరోజూ రూ.800 ఇచ్చేవాడని తెలియజేశాడు. జయచంద్రారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి తన ద్విచక్రవాహనం అక్కడ పెడితే ఏ-19 జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే అన్నురాసు అలియాస్ బాబు స్కార్పియో తాళాలు ఇచ్చేవాడని, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్‌కు చెందిన రాక్‌స్టార్ వైన్స్ నుంచి నకిలీ మద్యం తీసుకుని బెల్ట్‌షాపులకు సరఫరా చేసేవాడినని వాంగ్మూలం ఇచ్చాడు.

నిందితులు 23 ...అరెస్టయ్యింది 15 మంది

ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీకి సంబంధించి ఇప్పటి వరకు 23 మందిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి 15 మందిని అరెస్టు చూపారు. ఈనెల 3వ తేదీ ఎక్సైజ్ అధికారులు నకిలీ మద్యం తయారీ గుట్టును రట్టు చేశారు. ఈనెల 4వ తేదీ విశాఖపట్నంకు చెందిన సయ్యద్‌హాజీ, వాహన డ్రైవర్ బాలరాజు, తమిళనాడుకు చెందిన మనిమారన్, ఆనందన్, సూర్య సురేశ్, ఒరిస్సాకు చెందిన మిథున్, ఆనంద్‌దాస్, పీటీఎం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, రంగసముద్రంకు చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తరువాత ఈనెల 8వ తేదీ ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రం ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు అనుచరుడు కట్టా రాజు, నకిలీ మద్యం తయారు చేసిన పాత డాబాను అగ్రిమెంట్ చేసుకున్న తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. కట్టా రాజు దగ్గరున్న డైరీ, ల్యాప్‌టాప్‌ను సీజ్ చేశారు. తాజాగా శనివారం జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహనం ద్వారా నకిలీ మద్యం సరఫరా చేసిన ములకలచెరువుకు చెందిన సయ్యద్ కలీం అష్రఫ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో నిందితులైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, ఆయన ఇంట్లో పనిచేసే అన్నురాసు అలియాస్ బాబు, బెంగళూరుకు చెందిన బాలాజీ, సుదర్శన్, పెద్దతిప్పసముద్రంకు చెందిన చైతన్య బాబు, కృష్ణా జిల్లా గన్నవరం మండలం జిల్లా సురంపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డిలు అరెస్టు కావాల్సి ఉంది. కేసులో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు, హైదరాబాదుకు చెందిన రవిలు ఇబ్రహీంపట్నం కేసులో కూడా ఉండడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని అక్కడ అరెస్టు చూపారు. ములకలచెరువు కేసులో వీరిద్దరిని ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ వేసి ఇక్కడికి తరలించే అవకాశం ఉంది.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

- డీఆర్వో మధుసూదన్‌రావు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని డీఆర్వో మధుసూదన్‌రావు అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని సాయిశుభ కల్యాణ మండపంలో డీఆర్వో అధ్యక్షతన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ 11 మందితో కూడిన నూతన కార్యవర్గంతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర పాలకమండలి సభ్యుడు రవిప్రకాశ్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. ఎన్నిక అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ పి.రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా షేక్ మహమ్మద్‌షరీఫ్ (రాయచోటి), ట్రెజరర్‌గా డాక్టర్ వేణుగోపాల్ (చిట్వేలి), సభ్యులుగా డాక్టర్ జగదీశ్ (మదనపల్లి), డాక్టర్ కె.అపర్ణ (మదనపల్లి), డాక్టర్ వి.ప్రతాప్ (రామాపురం), డాక్టర్ మహేశ్వర్‌రాజు (రాయచోటి), డాక్టర్ సుధాకర్‌రెడ్డి (రాయచోటి), డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, అంతర్జాతీయ ఫెన్సింగ్ చాంపియన్ హరిశంకర్ (మదనపల్లి) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ రెడ్‌క్రాస్ సెక్రటరీ శ్రీనివాసులు, భరతమాత స్ఫూర్తి కేంద్రం సభ్యులు గోవర్దన్, గురవయ్య, కౌన్సిలర్ చంద్రశేఖర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే ఈకేవైసీ

- పీడీ వెంకటరత్నం



కోడూరు మండలం కె.బుడుగుంటపల్లెలో ఈకేవైసీని పర్యవేక్షిస్తున్న పీడీ వెంకటరత్నం

రైల్వేకోడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కోసమే ఈకేవైసీ చేస్తున్నట్లు ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటరత్నం తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని కె.బుడుగుగుంటపల్లె, ఉర్లగట్టుపోడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో ఆధార్‌తో అనుసంధానమైన జాబ్‌కార్డుదారులకు ఈకేవైసీ నిర్వహించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సెలవు అయినా రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల్లో పర్యటించి ఈకేవైసీ పూర్తి చేయాలని ఉపాధి అధికారులను ఆదేశించామని తెలిపారు. వివిధ పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీలు, లబ్ధిదారులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం కె.బుడుగుంటపల్లెలోని శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రాజంపేట క్లస్టర్ అధికారి మృత్యుంజయరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చ..పచ్చగా...

- 5 వేల ఎకరాల్లో సాగైన వరి పంట
- 20 ఏళ్ల తర్వాత సస్యశ్యామలంగా చెయ్యేరు నది పరీవాహక ప్రాంతం

6




దర్గాగా ప్రభుత్వ భూమికి కంచె...

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కంచెను తొలగించిన అధికారులు

6

గుప్త నిధుల కలకలం

- హంద్రీ-నీవా కాలువ పక్కన తవ్వకాలు



పూజలు చేసి చల్లిన అక్షింతలు




సొన్నువారిపల్లె రోడ్డు వద్ద గుప్తనిధుల కోసం తవ్విన గుంత

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల కోసం యంత్రాలతో పెద్ద గొయ్యి తీసి పూజలు చేసిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న హంద్రీ-నీవా కాలువ పక్కన సొన్నువారిపల్లె రోడ్డు వద్ద ఉన్న మామిడి తోట పక్కనే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి అక్కడ క్షుద్రపూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, అక్షింతలతో పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. పీటీఎం పరిసర ప్రాంతాలలో పూర్వీకులు అప్పట్లో చనిపోయిన వారిపై బంగారం పెట్టి పాతిపెట్టేవారని పెద్దలు అంటుంటారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు అమావాస్య పౌర్ణమి రోజుల్లో అక్కడక్కడా క్షుద్రపూజలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పోలీసులు గుప్తనిధుల తవ్వకాలపై దృష్టి సారించి అనుమానితులను పట్టుకుని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాలివీడులో కుండపోత

- అత్యధికంగా 108.4 మి.మీ వర్షపాతం నమోదు
- పెరిగిన వెలిగల్లు జలాశయం నీటిమట్టం



వెలిగల్లు జలాశయంలో పెరిగిన నీటిమట్టం



కుషావతి నదిలో ప్రవహిస్తున్న నీరు

గాలివీడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వరుణుడి ఉగ్రరూపంతో గాలివీడులో కుండపోత వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి 108.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో శ్రీదుర్గ తెలిపారు. భారీ వర్షం కారణంగా చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ప్రవాహంతో వెలిగల్లు జలాశయంలో 3.110 టీఎంసీలకు చేరింది. దాదాపు 1 టీఎంసీ నీటిమట్టం పెరిగిందని జలాశయ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 4.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.027 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ శిరీష్‌కుమార్ తెలిపారు. మండలంలో కురిసిన వర్షానికి గోరాన్ చెరువు నుంచి వడిసెలవంక వద్ద వంక ప్రవాహం పెరగడంతో పెద్దచెరువులో 40 శాతం నీరు వచ్చి చేరింది. ఎల్లంపల్లి, కుషావతి రిజర్వాయర్ నుంచి నడింపల్లి మీదుగా వస్తున్న ప్రవాహంతో చిన్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇంకా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకున్నాయి.

పచ్చ.. పచ్చగా...



చెయ్యేరు నది పరీవాహక ప్రాంతంలో విస్తారంగా సాగైన వరి పంట

- 5 వేల ఎకరాల్లో సాగైన వరి పంట
- 20 ఏళ్ల తర్వాత సస్యశ్యామలంగా చెయ్యేరు నది పరీవాహక ప్రాంతం

రాజంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి పంట పండింది. చెయ్యేరు నది ఆధారంగా మూడు మండలాల ప్రజలు సుమారు 20 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. గతంలో భారీ వర్షాలు కురుస్తుండడం, బోరుబావులు లేకపోవడం, ఎగువ ప్రాంతాల్లో అన్నమయ్య ప్రాజెక్టు ఇతర ప్రాజెక్టులు లేకపోవడం కారణంగా చెయ్యేరునది ఏడాదంతా నీటితో కళకళలాడుతూ ఉండేది. అటువంటి నదికి ఎగువ ప్రాంతాల్లో అన్నమయ్య, పింఛా తదితర అనేక ప్రాజెక్టులు కట్టడం వల్ల వర్షాకాలంలో ప్రాజెక్టులు నిండితే తప్ప దిగువ ప్రాంతాలకు నీరు వచ్చేది కాదు. ప్రధానంగా 20 ఏళ్లగా వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర పరిణామాలు రావడంతో కనీస వర్షపాతం కూడా కురవడం లేదు. దాని వల్ల ఏడాదంతా నదికి నీరు వచ్చే పరిస్థితి లేదు. అడుగడుగునా బోరుబావులు భారీ ఎత్తున వేయడంతో ఏటిలో ఉన్న నీరంతా ఇంకిపోతోంది. ఇత్యాది కారణాల వల్ల గతంలో మూడు పంటలు పండే చెయ్యేరు నది నేడు వెలవెలబోతోంది. అయితే ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో ఒక మోస్తారు వర్షాలు కురుస్తుండడం, దాంతో పాటు అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల పడే వర్షపు నీరంతా దిగువ ప్రాంతాలైన చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాలకు చేరుతోంది. దీనివల్ల రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని సుమారు 100 గ్రామాల ప్రజలు చెయ్యేరు నీటిని ఆధారం ఊట కాలువల ద్వారా వచ్చే నీటితో విస్తారంగా వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట మూడు దశల్లో ఉంది. పులపత్తూరు, మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, తాళ్లపాక, శేషమాంబపురం, పాపరాజుపల్లె, నారాయణనెల్లూరు, నందలూరు, నాగిరెడ్డిపల్లె, పాటూరు, కుమ్మరపల్లె, ఇసుకపల్లె, మందరం, మందరం రాచపల్లె, లేబాక, టంగుటూరు, పొత్తపి, ఓబిలి, పెనగలూరు ఇలా వందకు పైబడి గ్రామాల రైతులు పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెయ్యేరు నదికి నీరు చేరి పంటలు బాగా పండిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 5 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఆ పంట అంతా చేతికొచ్చే పరిస్థితి ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నందున ఇప్పుడు మరో 5 వేల ఎకరాల పైబడి వరి పంట సాగు చేయడానికి నార్లు కూడా పోశారు. మరికొన్నిచోట్ల నాట్లు కూడా నాటారు. ఇక్కడ వరిలో అన్ని రకాలను సాగు చేస్తున్నారు. అయితే కొత్తగా బాస్మతి వరిని కూడా సాగు చేశారు. తొగూరుపేటకు చెందిన శివరామయ్య తదితర రైతులు బాస్మతి రకం వరిని కిలో రూ.200 పెట్టి సాగు చేశారు. ఈ పంట కూడా పెద్దఎత్తున పండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వెన్నుకు వచ్చిన బాస్మతి వరి



తొగూరుపేటలో సాగైన బాస్మతిరకం వరి

బాస్మతి రకాన్ని కూడా సాగు చేశాం



చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో ఈ ఏడాది విస్తారంగా వరిపంటను సాగు చేశాం. వరద నీరు భారీఎత్తున వస్తుండడంతో అనేక ఏళ్ల తర్వాత భారీ ఎత్తున వరి పంట సాగు చేశాం. నేను సుమారు ఎకరా పొలంలో కిలో రూ.200 పెట్టి బాస్మతిరకం వరి పంటను సాగు చేశాను. ఈ పంట బాగా పండింది. ఒక్కో వెన్ను జానెడు పొడవు ఉంది. ఎకరాకు కనీసం 50 బస్తాలు వచ్చే అవకాశం ఉంది. కిలో బాస్మతిరకం బియ్యానికి వందల రూపాయల్లో గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంది. అందరూ ఈ పంటను సాగు చేయడానికి విత్తనాల కోసం నేను పండించిన బాస్మతిరకం వడ్లను అడుగుతున్నారు.

- శివరామయ్య, రైతు, తొగూరుపేట.

సుదీర్ఘ కాలం తర్వాత విస్తారంగా వరి సాగు



సుదీర్ఘ కాలం తర్వాత చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వరి పంటను సాగు చేయడం శుభపరిణామం. 20 ఏళ్లగా వర్షాలు లేకపోవడం వల్ల పంటల సాగు తగ్గింది. నాలుగేళ్ల కిందట వర్షం పడినా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో చుక్కనీరు లేకుండా వృథా అయ్యింది. ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నందున చెయ్యేరునది పరివాహక ప్రాంతాలైన మూడు మండలాల్లో వేలాది ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. విస్తారంగా వర్షాలు పడడం, దానికితగ్గట్టు ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు తెగిపోవడం వల్ల వర్షపునీరు దిగువ ప్రాంతాలకు చేరడం వల్ల ఊటకాలువలకు నీరు చేరి కావాల్సిన సాగునీరు రావడంతో తిరిగి వరిపంటను విస్తారంగా సాగు చేశారు. దీనివల్ల తిండిగింజలకు యేడాదంతా ఇబ్బంది ఉండదు.

- కొండా శ్రీసివానుసులు, మందపల్లె, రాజంపేట

ఏడాదికి ఒక దూడ.. రైతుకు లాభసాటి



పశువులకు చికిత్స చేస్తున్న వెటర్నరీ ఏడీ విశ్వేశ్వరరెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఒక దూడ రైతుకు లాభసాటి అని వాల్మీకిపురం వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పత్తేపురం గ్రామంలో పశువులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందులో 200కు పైగా పశువులకు సూడి పరీక్షలు, ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్స, దూడలకు ఏలిక పాముల నివారణ, ఆవులకు గోమార్లు, పిడుదులకు బోటాక్స్ స్ప్రే తదితర వైద్యం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆవు ఈనిన నెల నుంచీ రెండు నెలల్లోపు ఎదకు వచ్చిన ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే రైతుకు లాభసాటి అని, ఈ విధంగా ఏడాదికి ఒక దూడను పొందవచ్చన్నారు. పెయ్య దూడ పుట్టే విధంగా వీర్యకణాలు అందుబాటులో ఉన్నాయని, ఆవు ఎదకు వచ్చిన సమయాన ఈ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే పూర్తి పెయ్య దూడలే పుడతాయన్నారు. ఈ వీర్య నాళిక ఖరీదు రూ.150లకు సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సుండుపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలో జూదమాడుతున్న అరుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని రాచంవాండ్లపల్లె వద్ద ఉన్న మామిడి తోటలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ స్వాధీనం





ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, గాయపడ్డ నాగేశ్వర్‌నాయక్

సుండుపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికీ కాలనీకి చెందిన నాగేశ్వర్‌నాయక్‌కు శనివారం తీవ్రగాయాలయ్యాయి. పింఛా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఎలమందకు చెందిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఢీకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చి క్షతగాత్రుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తిరుపతికి రెఫర్ చేసినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఎలమంద, రొంపిచర్ల, పీలేరు, కేవీపల్లి, భాకరాపేట వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రతి రోజు పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలోని నది నుంచి, బాహుదానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ప్రమాదానికి ఇసుక అక్రమ రవాణానే కారణమని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ కృష్ణారెడ్డి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని దేవపట్ల బస్టాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిక్కం కృష్ణారెడ్డి అనే వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లికి చెందిన తిక్కం కృష్ణారెడ్డి దేవపట్ల నుంచి టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి వస్తున్న స్కూటర్ ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అతడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

క్రీడల్లో గురుకులం విద్యార్థుల సత్తా

తంబళ్లపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల్లో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో అండర్-17 బాలుర ఖోఖోలో శశినాయక్, నాగేంద్రబాబు నాయక్, వాలీబాల్, ట్రిపుల్ జంప్‌లో నిరంజన్ నాయక్, అండర్-14 యోగాలో చరణ్ సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య శిల్పా (35) కుటుంబ సభ్యులతో గొడవపడి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- కండక్టర్‌కు తీవ్ర గాయాలు...



గాయపడ్డ కండక్టర్ వెంగమణి

ఒంటిమిట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కండక్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆగి ఉన్న లారీని తిరుపతి వైపు వెళ్తున్న పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో కండక్టర్ వెంగమణి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన



మిషన్ కాంపౌండులో అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో రెండు చోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన జరగడంతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మిషన్ కాంపౌండు, టిప్పు సుల్తాన్ మైదానంలో రెవెన్యూ, ఫైర్, పోలీసు, ఎస్పీడీసీఎల్, మున్సిపల్ అధికారులు శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మిషన్ కాంపౌండు, టిప్పుసుల్తాన్ మైదానంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. సబ్‌కలెక్టర్‌కు నివేదికలు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శివప్ప, వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, బాణసంచా దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప డంప్...?

- పట్టించుకోని అధికారులు



గుర్రంకొండ-సరిమడుగు మార్గంలో మసీదు పక్కన డంప్ చేసిన కలప

గుర్రంకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కలప వ్యాపారులు ఇష్టానుసారంగా వృక్షాలను నరికేస్తున్నారు. రైతుల పొలాలు, ప్రభుత్వ భూముల్లో వృక్షాలను నరికేసి చీకటి పడగానే ట్రాక్టర్లలో ఓ చోట డంప్ చేస్తున్నారు. ఇలా డంప్ చేసిన కలపను తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా డంప్ చేసిన కలప గురించి రైతులు, ప్రజలు అధికారులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె, సరిమడుగు, గుర్రంకొండ, నడిమిఖండ్రిగ, సంగసముద్రం, శెట్టివారిపల్లె, తరిగొండ గ్రామాల్లో రోజూ చింత, మామిడి, నేరేడు, వేప, కానుగ, మర్రి వృక్షాలను రంపాలతో తొలగిస్తున్నారు.

ఇలా నరికేసిన వృక్షాలను పాలకుంటపల్లె, సరిమడుగు, తలారివాండ్లపల్లె, మార్కెట్ యార్డు, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో అక్రమంగా కలపను డంప్ చేస్తున్నారు. ఈ డంప్‌లను లారీలకు లోడ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నారు. కలప డంప్‌పై రైతులు, ప్రజలు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గుసగుసలాడున్నారు. ఈ విషయమై ఆర్ఐ సదాశివప్పనాయుడును వివరణ కోరగా సరిమడుగు మార్గంలో అక్రమంగా కలప డంప్ చేసినట్లు తన దృష్టికి రాలేదన్నారు. కలప డంప్‌ను పరిశీలించి అనుమతులు లేకుంటే సీజ్ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన ఆస్పత్రికి గ్రహణం

- భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లు
- ప్రారంభానికి నోచుకోని వైనం



ప్రారంభానికి నోచుకోని నూతన ఆస్పత్రి భవనం



శిథిలావస్థకు చేరిన పాత పీహెచ్‌సీ

చిట్వేలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి 21 పంచాయతీలున్న పెద్ద మండల కేంద్రం. కానీ ఇక్కడ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అంతంత మాత్రమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ 200 మందికి పైగా వైద్యసేవలు పొందుతున్నారు. ఇక్కడ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లయినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణం పూర్తయి కాంట్రాక్టర్ తాళాలు అప్పగించినా అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన భవనానికి గ్రహణం ఎప్పుడు వీడుతుందో అని ఎదురుచూస్తున్నారు. భవనం పూర్తయి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు నూతన భవనంలో రోగులకు వైద్యసేవలు నోచుకోలేదని ప్రజల నుంచి తీవ్రంగా విమర్శలు వినపడుతున్నాయి. కోటికి పైగా నిధులు వెచ్చించి సరికొత్తగా నూతన భవనాన్ని నిర్మించారు. భవనం పూర్తయి రోగులకు వైద్యసేవలు మెరుగ్గా అందుతాయని మండల ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్నప్పటికీ ఇంతవరకు అది ప్రారంభానికి నోచుకోలేదు. పాత భవనంలో పూర్తిగా పాడవడంతో వర్షం కురిస్తే చాలు భవనంపై పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోనని భయంతో సిబ్బంది, అటు రోగులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న మరమ్మతులు చేసుకుంటూ తాత్కాలికంగా పాత భవనంలో వైద్యసేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చింది త్వరలో నూతన భవనంలో వైద్యసేవలు అందుతాయనుకున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన నూతన భవనంలో వైద్యసేవలు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో పసికందు మృతి

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన
- చిన్నారి బంధువుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు



మృతి చెందిన పురిటిబిడ్డ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కళ్లు తెరవకనే పసికూనను కడతేర్చిన సంఘటన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జరిగింది. బాధితులు మదనపల్లె టూటౌన్ పోలీసులకు డాక్టర్ల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె కుమ్మరవీధికి చెందిన ప్రసాద్, కవిత దంపతులకు మొదటి కాన్పులో ఆడబిడ్డకు సాధారణ ప్రసవం జరిగింది. తిరిగి 11 ఏళ్ల తరువాత గర్భం దాల్చి రెండో ప్రసవం కోసం శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మధ్యాహ్నం 3 గంటలకు వచ్చారు. పరీక్షలు చేసిన డాక్టర్లు అంతా సవ్యంగా ఉందని, తొందర ఏమీ లేదని తెలిపారు. బాధితులు రాత్రి 6 గంటలకు కూడా ఏమైనా ఇబ్బంది ఉంటే మరోచోట చూపించుకుంటామని డాక్టర్లతో చెప్పారు. నొప్పులు వస్తున్నాయి ఆలస్యంగా కాన్పు అవుతోందని, తొందరపడితే కాదని చెప్పడంతో మిన్నకుండిపోయారు. శనివారం కడుపులో బిడ్డ కదలలేదని గుర్తించి పది గంటలకు కాన్పు చేశారు. అప్పటికే బిడ్డ చనిపోయింది. పసికందు కనులు తెరవకనే డాక్టర్లు కడతేర్చారని బాధితులు వాపోయారు. ఎన్నో ఏళ్ల తరువాత గర్భం నిలిస్తే డాక్టర్లు గర్భశోకం మిగిల్చారని విలపించారు. డాక్టర్లపై కేసు నమోదు చేయాలని బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

దర్జాగా ప్రభుత్వ భూమికి కంచె...

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కంచెను తొలగించిన అధికారులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి



కంచెను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఒంటిమిట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు అక్రమార్కులు అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వాలు మారినా అక్రమార్కులు మాత్రం మారడం కారణం ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో వారు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నారు. మండంలోని గొల్లపల్లి, ధవంతంపల్లి గ్రామాల్లో సర్వే నెం-78, 662లో అక్రమార్కులు కన్నేసి దర్జాగా ప్రభుత్వ భూములను ఆక్రమించారు.

కొండను సైతం పిండి చేశారు యంత్రాల సాయంతో చదును చేసి కంచెను కూడా ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉంది. మండల కేంద్రమైన ఒంటిమిట్ట నుంచి పది కిలోమీటర్ల లోపే ఉన్న ఈ గ్రామాలలో భూఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటి వెనుక ఎవరి హస్తమున్నదో అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. సర్వే నెం.78లో గొల్లపల్లి గ్రామానికి చెందిన తొప్పెన అన్నపూర్ణమ్మ పేరుతో సుమారు 13 ఎకరాలు ఆక్రమించేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన తుంగ గోపయ్య మూడు ఎకరాలు ఆక్రమించారు. ధవంతంపల్లి గ్రామంలోని 662 సర్వే నెంబర్‌లో 4 ఎకరాలు వెంకటసుబ్బయ్య ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చదును చేశారు. ఈ సమాచారం రెవెన్యూ అధికారులకు ఆలస్యంగా తెలియడంతో రంగప్రవేశం చేసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి కంచె తొలగించారు. ఈ విషయమై తహసీల్దార్ దామోదర్ రెడ్డిని వివరణ కోరగా ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించి కంచెను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

సీకేదిన్నె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మంగళి లక్ష్మీదేవి(40) మృతి చెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు... చింతకొమ్మదిన్నె మండలం బుగ్గవంకలో శనివారం మేకల కాపరి మేకలు మేపుకుంటుండగా ఓ గుర్తు తెలియని శవాన్ని చూసి సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించాడు. దీనిపై పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం గతంలో ఈ నెల 4వ తేదీన మహిళ అదృశ్యంపై నమోదైన కేసు తరుపు బంధువులను పిలిపించి చూపించగా చనిపోయిన వ్యక్తి మామిళ్లపల్లె జగనన్న కాలనీకి చెందిన మంగళి బుగ్గరమేష్ భార్య లక్ష్మీదేవిగా గుర్తించారు. కర్నూలు జిల్లాకు చెందిన వీరు పది సంవత్సరాల క్రితం కడపకు వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నట్లు వారి బంధువులు తెలిపారు. బుగ్గరమేష్, అతని కుమారులు ఇద్దరు ఇందిరానగర్‌లో హెయిర్‌కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని, ముగ్గురు మూడు కటింగ్ షాపులు నిర్వహిస్తూ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. అయితే రమేశ్ తాగుడుకు అలవాటుపడి మానకపోవడంతో సెప్టెంబరు 30న ఇంటిలో గొడవ జరిగిందని, మద్యం వ్యసనం మానుకోవాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకపోవడంతో ఆరోజు రాత్రి అందరు పడుకుని తెల్లవారి లేచేసరికి 1వ తేదీ మంగళి లక్ష్మీదేవి కనిపించకుండాపోవడంతో వారి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతికి, బంధువుల ఇండ్ల వద్ద విచారించి చివరకు 4వ తేదీన పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కనిపించకుండా పోయిన మహిళ శనివారం బుగ్గవంకలో మరణించిందనే విషయం తెలుసుకుని వారి బంధువులను పిలిపించి నిర్ధారించుకున్న తర్వాత మృతదేహం కుళ్లి వాసన వస్తుండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే క్యాంటీన్ సేల్స్‌మాన్ ఆత్మహత్య


మృతి చెందిన సురేశ్

ఎర్రగుంట్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ క్యాంటీన్‌లో సేల్స్‌మాన్‌గా పని చేస్తున్న కంభం సురేశ్(32) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన సురేశ్ స్థానిక మెయిన్‌బజార్ లోని అమ్మవారిశాల పక్కనున్న రైల్వే క్యాంటీన్‌లో ఓ గదిలో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. క్యాంటీన్ నడుపుతున్న యాజమానికి సురేశ్ డబ్బులు బాకీ ఉన్నాడు. కానీ కొంతకాలంగా సురేశ్ ఇక్కడ పనిచేయకుండా వెళ్లిపోయాడు. అకస్మాత్తుగా ఇటీవల కడపలో సదరు యజమానికి సురేశ్ కనిపించగా కొట్టి, మందలించి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చినట్లు సీఐ తెలిపారు. డబ్బు కట్టలేనని, అయితే ఎర్రగుంట్లకే వచ్చి క్యాంటీన్‌లో పని చేస్తానని తెలిపి ఇక్కడికి వచ్చి పని చేస్తున్నాడన్నారు. అయితే కొట్టినందుకు మనస్థాపం చెందాడా లేక మరేం జరిగిందో కాని శుక్రవారం రాత్రి ఇంట్లోని ఓ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ వివరించారు. వీఆర్వో విజయభాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

టపాసుల అక్రమ నిల్వలపై దాడి


పట్టుబడిన టపాసులు, పేలుడు పదార్థాలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాసనగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను టూటౌన్ సీఐ సదాశివయ్య ఆధ్వర్యంలో శనివారం సీజ్ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసనగర్‌లో షేక్ నూర్ జహాన్, ఆమె కుమారుడు షరీఫ్ లైసెన్సు లేకుండా పేలుడు పదార్థాలు బయటనుంచి తీసుకువచ్చి అక్రమంగా నిల్వ చేసుకున్నారు. అలాగే టపాసులు చేయడానికి మందుగుండు సామగ్రిని కూడా ఇంట్లో భద్రపరిచారు. ఈ మేరకు సమాచారం రావడంతో శనివారం సీఐ ఆధ్వర్యంలో దాడులు చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు షేక్ నూర్‌జహాన్, ఆమె కుమారుడు షరీఫ్‌లపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఎవరైనా లైసెన్సు లేకుండా ఇళ్లలో టపాసులు, మందుగుండు సామగ్రి ఉంచుకున్నా, తయారు చేసినా సమాచారమివ్వాలని కోరారు.

కానిస్టేబుల్‌పై దాడి

- ఇరువురిపై కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేటకు చెందిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కడప టూటౌన్‌లో పనిచేస్తున్న బ్లూకోల్ట్ కానిస్టేబులు నాలుగు రోజులక్రితం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మాసాపేట వద్ద ఓపెళ్లి ఫంక్షన్‌లో కొందరు డ్యాన్స్ చేస్తుండగా బ్లూకోల్ట్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి మరో వ్యక్తి కలిసి ఆ కానిస్టేబులుపై దాడి చేశారు. కానిస్టేబులు ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... శనివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో 50 సంవత్సరాల గుర్తు తెలియని మహిళ కనుమలోపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో కడప-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు అడ్డంగా వెళ్లి దాని కిందపడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కడప రిమ్స్ మార్చురీ గదికి తరలించారు. అయితే ఈమె వద్ద ప్లాస్టిక్ సంచిలో ప్లాస్టిక్ బాటిళ్లు ఉండడంతో ఆమె ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని జీవనం సాగించే మహిళగా తెలుస్తోందన్నారు. వివరాలు తెలిసిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్

మైదుకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరు బస్టాండు ప్రాంగణంలో నిలిపిన ద్విచక్ర వాహనాల యజమానులకు శనివారం సీఐ రమణారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల ద్విచక్ర వాహనదారులు పబ్లిక్ ప్రదేశాలలో బాధ్యతారహితంగా భద్రత లేకుండా పార్కింగ్ చేయడం వలన దొంగతనాలు జరుగుతుండటంతో స్పందించిన సీఐ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సైడ్‌లాక్ వేయకుండా పార్క్ చేసిన మోటారు సైకిళ్లను ఒకచోటకు తీసుకువచ్చి, వాహనాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కచ్చితంగా మోటారు సైకిళ్లకు సైడ్‌లాక్ వేసుకోవాలని, పోలీసు సూచనలు పాటించాలని ఆయన కోరారు.

పుట్టి మునిగింది..

ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారుల పాలవుతోంది. రైతు కష్టపడి పండించిన ధాన్యానికి దళారులే ధర నిర్ణయిస్తున్నారు. వారు చెప్పిన ప్రకారమే కర్షకుల కష్టం అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో పుట్టి ధాన్యానికి (8బస్తాలు) పదివేల రూపాయలకు పైగా ఖరీఫ్ రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ప్రకనటించినా రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ధర పెంచాలని కోరినా ససేమిరా అంటున్నారు. దళారులు చెప్పిన ధరతో పుట్టి ధాన్యం నష్టంతో అమ్ముకోవాల్సిన పరిస్థితి. రైతులకు నష్టాల బాధ తప్పలేదు.


లారీలోకి ధాన్యం బస్తాలు ఎక్కిస్తున్న వైనం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

- దళారులు చెప్పిందే ధర
- నష్టపోతున్న రైతులు

చెన్నూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కేసీ కెనాల్‌కు కాసింత నీరు రావడంతో ఆయకట్టు కింద మండల వ్యాప్తంగా 3600 ఎకరాలకు పైగా వరి సాగు చేపట్టారు. వారంరోజులుగా ఈ వరి పంట కోతలు మొదలయ్యాయి. ఇప్పటికే చెన్నూరుతో పాటు కనుపర్తి, దౌలతాపురం, బలసింగాయపల్లె, రామనపల్లె ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. అయితే వరి ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దు, గిట్టుబాటు ధర కల్పిస్తామని కూటమి ప్రభుత్వం పదే పదే చెబుతున్నా రైతులు కోసిన వెంటనే ధాన్యాన్ని అమ్ముతున్నారు. దళారులు ఇదే అదునుగా భావించి ధర తగ్గించి కొనగోలు చేస్తున్నారు. పదిరోజుల క్రితం మొదటి దశగా వరికోత చేపట్టగా ఆ తరువాత రెండు రోజులకే పుట్టి ధాన్యం (8బస్తాలు) రూ.11,600 వంతున దళారులు కొన్నారు. ప్రభుత్వం మాత్రం ఎక్కువ ధర ఇస్తామని చెప్పడంతో ఈ విషయం రైతులు దళారులకు చెప్పి కాసింత ధర పెంచాలని కోరినా ససేమిరా ఒప్పుకోకపోగా మేం చెప్పిందే ధర, అమ్మితే అమ్మండి.. లేదంటే లేదంటున్నారు దళారులు. గతి లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముతున్నారు.

మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలు

మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యం కొనేందుకు చెన్నూరుతో పాటు రామనపల్లెలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే కలెక్టరు ప్రకటించారు.

పుట్టికి నష్టం

పుట్టి ధాన్యాన్ని నష్టంతో అమ్ముకుంటున్నాడు. ప్రభుత్వం మాత్రం రూ.14వేలకు పైగానే కొంటామంటోంది. అయితే అప్పు చేసి సాగు చేసిన రైతు పంటను అమ్మి కొంత వరకైనా అప్పు తీర్చాలని దళారులకు విక్రయిస్తున్నాడు. పైగా ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు పుట్లు (32 బస్తాలు) మించి దిగుబడి రాలేదు. ఖర్చు ఎకరాకు రూ.30వేలకు పైమాటే. నాలుగు నెలల పాటు కష్టపడ్డ రైతుకు ఎకరాకు మిగిలింది ఐదువేల వరకు వచ్చినా కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాని పరిస్థితి.

మంచి గిట్టుబాటు ధర అందిస్తుంది..

పండించిన పంటకు ప్రభుత్వం మంచి గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ప్రభుత్వం గ్రేడ్ ఎ రకం క్వింటా రూ.2389 అందిస్తుంది. అయితే దళారులకు అమ్మితే క్వింటా రూ.1813కే అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో రైతు నష్టపోవాల్సిందే. కాసింత ఓపిక పడితే ప్రభుత్వమే కొని మంచి గిట్టుబాటు ధర ఇస్తుంది. రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దు. ఇప్పటికే రైతులకు ఈ విషయం తెలిపాం. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఏం చేయాలో అన్ని చర్యలు తీసుకుంటుంది.

- ఎ.శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి, చెన్నూరు

శ్రీవెంకటేశం.. మనసా స్మరామి

- దేవునికడప శ్రీవారిని దర్శించుకున్న భక్తులు


ఇరుదేవేరులతో శ్రీవారు



కడప కల్చరల్, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీనివాసం.. శ్రితపారిజాతం.. శ్రీవెంకటేశం.. మనసా స్మరామి" అంటూ భక్తులు దేవునికడప లక్ష్మీవెంకటేశ్వస్వామిని స్మరించారు. తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం బారులు తీరి ఎంతో సహనంతో స్వామివారిని కన్నులారా తిలకించి ఆనందభరితులయ్యారు. ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చేలా పని చేయాలి

- మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించిన వారికి ఎమ్మెల్యే సన్మానం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చేలా పని చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాల ఆవరణలో మెగా డీఎస్సీలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టీచర్ ఉద్యోగం సాధించిన 70 మందిని ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగుల కల నెరవేర్చారన్నారు. ప్రతి ఏడాది జనవరిలో డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి నారా లోకేశ్ కూడా ప్రకటించారన్నారు. ఉపాధ్యాయులు ఉద్యోగం వస్తే చాలని కాకుండా విద్యార్థులకు బాగా పాఠాలు చెప్పి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు ముక్తియార్, ఆసం రఘు, జబీవుల్లా, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాకీర్, విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసాచారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, మండల అధ్యక్షుడు సీతంపల్లె చంద్ర, మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి కోనేటి క్రిష్ణప్రదీప్ రెడ్డి, జనసేన నేత జిలాన్ బాషా, లింగాపురం పీఏసీ ఛైర్మన్ సిద్దారెడ్డి నాగముని రెడ్డి, ఏంతఃవోలు సావిత్రమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- అదుపులోకి తీసుకున్న పోలీసులు



కడప నాగరాజుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఎస్పీ బంగ్లా వద్ద ఓ యువకుడు నడిరోడ్డుపై వాహనాలు ఆపి వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో రోడ్లపై కార్లు ఆపి కేకలు వేశాడు. తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, తన భార్య వదిలేసిందని, తన కూతురు చనిపోయినా కూడా ఎవరూ చెప్పలేదంటూ ఆక్రోషించాడు. దీంతో విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

బతుకు తెరువు కోసం వచ్చి బలి

- విద్యుదాఘాతంతో కడప జిల్లా వ్యక్తి మృతి


మృతి చెందిన జనార్దన్ ఫైల్‌ఫొటో

కుందుర్పి, అక్టోబరు 11(ఆంధ్ర జ్యోతి): బతుకుదెరువు కోసం ఓ వ్యక్తి ఊరుగాని ఊరికి వచ్చి బలైపోయిన సంఘటన శనివారం అనంతపురం జిల్లా కుందుర్పిలో జరిగింది. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుదాఘాతంతో కడపజిల్లాకు చెందిన కూలి జనార్ధన్(43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పిలో నూతన విద్యుత్ లైను ఏర్పాటు పనులను కాంట్రాక్టర్ రమేష్ గత కొన్ని రోజులుగా చేయిస్తున్నాడు. ఈ పనులు చేసేందుకు దినకూలీగా కడప జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం కె.సుగుమంచుపల్లికి చెందిన జనార్దన్ వచ్చాడు. భార్య, పిల్లలు సొంతూరులో ఉండగా జనార్దన్ తోటి కార్మికులతో కలిసి కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తుండగా జనార్దన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఆయన్ను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. జనార్దన్ మృతి వార్తను భార్య, బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అనంతపురం ఆస్పత్రికి చేరుకున్నారు. కొన్ని నెలలుగా తన భర్తకు కూలి కూడా ఇవ్వలేదని మృతుడి భార్య ఆరోపించారు. న్యాయం చేయమని అడిగితే బీమా పేరుతో కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడని కన్నీటి పర్యంతరమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

బద్వేలుటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి నెల్లూరు రోడ్డులో శనివారం ఫాతిమా చర్చీ ఎదురుగా ఆయిల్ ట్యాంకర్‌ను ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు అద్దాలు పగిలాయి. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతిన్నా ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

బద్వేలు పట్టణంలో చోరీ

బద్వేలుటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి మైదుకూరురోడ్డులోని భావనారాయణ నగర్‌లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమాని మజ్జారి వెంకటసుబ్బయ్య కుటుంబసమేతంగా శుక్రవారం కాళహస్తికి వెళ్లడంతో, ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు దానిని గమనించి శనివారం తెల్లవారుజామున చాకచక్యంగా తాళాలు పగులకొట్టి ఇంటిలోని వెండి వస్తువులు, కొంతమేర నగదును చోరీ చేశారు. స్థానికులు ఉదయం గమనించి ఇంటి యజమానికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే క్లూస్‌టీంను పిలిపించి వేలిము ద్రలు సేకరించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణను చేపట్టారు.

తల్లి మందలించిదని... ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం సోములవారి పల్లె పంచాయతీ ఈశ్వర్ రెడ్డి నగర్‌లో నివాసం వుండే ఇమాంబాషా అలియాస్ మున్నా (22) అనే యువకుడు చెడువ్యసనాలకు బానిసై నందున తల్లి మందలించిందని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డి నగర్‌లోని మాబున్నా, గౌస్‌బాషా దంపతులకు ఇద్దరు పిల్లలు వున్నారు. గౌస్‌బాషా బతుకుదెరువు కోసం కువైట్‌లో వుంటున్నాడు. తల్లి మాబున్నా ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. కుమారుడు ఇమాంబాషా అలియాస్ మున్నా చదువును మధ్యలోనే ఆపేసి చిన్నచిన్న పనులు చేసేవాడు. ఈక్రమంలో చెడువ్యసనాలకు బానిసై ఇంట్లో నుంచి వెళితే వారం రోజులు ఇంటికి రాకుండా బయటబయటే తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో తల్లి మందలించడంతో శుక్రవారం ఇంట్లో నుండి వెళ్లి ఎర్రగుంట్ల రోడ్డులోని ఫారెస్టు ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి మాబున్నా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల విక్రయానికి దరఖాస్తుల ఆహ్వానం

- కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో టపాసుల విక్రయానికి వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. టపాసుల విక్రయానికి కావాల్సిన గ్రౌండ్, ఇతర రుసుములు కలిపి రూ.10వేలు చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చే దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు. చెల్లింపు పూర్తిచేసిన దరఖాస్తుదారులకే లాటరీ ద్వారా స్టాళ్ల కేటాయింపులో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందడం కూడా తప్పనిసరి అన్నారు.

టాలెంట్ హంట్ వాయిదా

కడప స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న మెన్స్ సెలక్షన్ అండర్-12, 14, 16, 19 టాలెంట్ హంట్ వాయిదా పడినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ టాలెంట్ హంట్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పెనగలూరులో భారీ వర్షం



బస్టాండ్‌లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

పెనగలూరు అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా శనివారం ఉదయం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచి పల్లంపాడు, ఎన్‌ఆర్ పురం, గుడిసెన్నయ్యగారిపల్లి, కిరణంపల్లి, నాగిరెడ్డిపల్లి, పి.కొత్తపల్లి, పెనగలూరు, ఇండ్లూరు, సాతపల్లి, కంబాలకుంట, సింగనమల, సింగారెడిపల్లి, ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. వీధుల వెంట ప్రవాహంలో వర్షం నీరు పారింది.

వెంకట్రాజుపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

చిట్వేలి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకట్రాజుపల్లిలో శనివారం సీతారామ లక్ష్మణ హనుమంతులు, ధ్వజ స్థంభ , నాగుల నూతన బింబం , అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శని, ఆది వారాలు పూజాది కార్యక్రమాలు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య విగ్రహాల ప్రతిష్ఠ, 11 గంటల నుంచి సీతారాయుల కల్యాణోత్సవం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 4 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించండి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి రజక సంఘం నేతల వినతి

రాయచోటిటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని రజక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌బాబు, వీరబల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం వారు రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో ధోబీ ఘాట్లు ఆక్రమణకు గురికాకుండా చర్యలకు ఆదేశించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. అత్యంత వెనుకబడి ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసేలా కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రజకసంఘం నేతలు

ముఖ్యమంత్రి సహాయనిధి.. పేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న సాయి లోకేశ్

నందలూరు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర కుటుంబ సంక్షేమ వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన సయ్యద్ ఖాజా హస్సేన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2,54,277 చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, టీడీపీ నాయకులు సయ్యద్ అమీర్, రాష్ట్ర ఆర్యుగం విశ్వనాథ్, నాగిరెడ్డిపలి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, బీజేపీ నాయకుడు కోడూరు ఆదినారాయణ పాల్గొన్నారు.

రాజంపేట, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఆధ్వర్యంలో పబ్బొడ్డారపు సతీష్ రెడ్డి, శివ శంకరయ్య రెడ్డి, చర్ల వెంకటరమణ తదితరులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ పురందేశ్వరి సహకారంతో సీఎంతో మాట్లాడి సీఎం సహాయ నిధి చెక్కులను విడుదల చేయడం ఆనందదాయకమన్నారు. బీజేపీ నేతలు కృష్ణ యాదవ్, సునీత, నారాయణ వర్మ, షబ్బీర్, అహ్మద్, రాఘవయ్య, పివి రమణ పాల్గొన్నారు.

శ్రీశైలానికి బస్సు సర్వీసు ప్రారంభించండి



వినతిపత్రం అందజేస్తున్న లయన్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు

నందలూరు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం రాజంపేట నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నందలూరు లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై అన్నమయ్య జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారితో ఫోన్ ద్వారా సంప్రదించి ప్రజల అవసరాల దృష్ట్యా బస్సును ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. ఈ విషయంపై రవాణాశాఖ మంత్రితో తన వంతుగా మాట్లాడుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్స్ కుర్రా మణి యాదవ్, రామ్మోహన్, వాకర్ ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, అబ్దుల్లా, దండే ప్రకాష్, హిమగిరి యాదవ్, గంధం గంగాధర్, గండికోట కృష్ణ కుమార్, గుండు సురేష్ పాల్గొన్నారు.

కట్టు కాలువ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న వెంకట్రామిరెడ్డి

చిన్నమండెం, అక్టో బరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని ఎ గుండ్రాజు చెరువుకు మాండవ్య నది నుంచి నీరు తీసుకు వచ్చే కట్టుకాలువ తెగిపోయిన విషయంపై నాలుగేళ్లుగా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది. ఈ విషయం ఆంధ్రజ్యోతి లో ఆయకట్టు బీడు... అధికారులకు పట్టని గోడు అన్న శీర్షికతో కథనం వెలువడడంతో, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో వారు శనివారం కట్టుకాలువ పనులు ప్రారంభించారని వండాడి మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

పనిగట్టుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారు

●రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శిబ్యాల గ్రామానికి చెందిన కొంత మంది వైసీపీ నాయకులు పనిగట్టుకొని తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి అన్యాయం చేయదన్నారు. సంబేపల్లె మండలంలోని రైతుల కోసం కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అంశంపై కొందరు వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి వంక పోరంబోకు స్థలంలో ఏర్పాటు చేయడం మంచిది కాదని, విచారించి ఏర్పాటు చేయమని చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయంపైనే వారు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు.

'ప్రజా వ్యతిరేక చర్యలు ఎండగడతాం'

రైల్వేకోడూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగడతామని రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని వెంకటేశ్వరపురం గిరిజనకాలనీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను కూటమి ప్రభుత్వం మానుకోవాలన్నారు. లేదంటే ప్రజా ఉద్యమం ఉగ్రరూపం దాలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీపీ సింగమాల భవాని, జడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ,తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

రాయచోటి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): పట్టణ పరిధిలోని సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ ఎంకే రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. మాజీ అసిస్టెంట్ గవర్నర్ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి విధేయులై ఉండాలని తెలిపారు. దాతలు సుగవాసి జానకీరామ్, కుప్పం రెడ్డిశంకర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వైవీఎస్ ప్రకాశ్, సెక్రటరీ మహేశ్ రాజు, ట్రెజరర్ సూర్యప్రకాశ్, అసిస్టెంట్ గవర్నర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటిసంతకాల పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సైన్యంలా కదిలి వైసీపీ సత్తా చాటుదామని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలిసి కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు గురుకులం విద్యార్థులు



జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఖో ఖో పోటీలో మండలానికి చెందిన 15 మంది బాలికలు, 15 మంది బాలురు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ , ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చంద్రమోహన్ రాజు మాజీ సెక్రెటరీ శారద, గురుకులం పీఈటీ విజయ్ ఆనందమూర్తి తెలిపారు. పేద కుటుంబాల నుండి వచ్చిన ఈ విద్యార్థులందరూ జిల్లా స్థాయిలో సైతం విజయం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చమర్తికి సన్మానం




చమర్తి జగన్‌మోహన్ రాజును సన్మానిస్తున్న మందరం గ్రామస్తులు

రాజంపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజును రాజం పేట మండలం మందరం గ్రామ టీడీపీ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సంపతి సుబ్బమ్మ, టీడీపీ నేతలు సంపతి ఉమాపతి, గ్రామ నాయకులు పులిగోరి చంద్రారెడ్డి, లోకేష్ రెడ్డి, కడప రాంప్రసాద్, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు మందరం గ్రామ పరిధిలోని కొత్తపల్లి, రాచపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జగన్‌మోహన్ రాజును భారీ పూలమాల వేసి సత్కరించారు. గ్రామంలో టీడీపీ బలోపేతానికి చేపట్టవలసిన చర్యలు, స్థానిక సమస్యలను వివరించారు. గ్రామ సమస్యలను అన్నింటినీ పరిష్కరిస్తామని జగన్‌మోహన్ రాజు హామీ ఇచ్చారు.

అన్నమాచార్యలో 23 నుంచి అంతర్జాతీయ సదస్సు

రాజంపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ అండ్ అప్లికేషన్స్ (ఐసీడీఎస్‌ఎంఎల్‌ఏ-2025) పేరుతో డిసెంబర్ 23, 24 తేదీల్లో స్ప్రింగర్ ప్రచురణ మాధ్యమం సహకారంతో 7వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం చాన్సలర్ డా.సి.గంగిరెడ్డి , వైస్ చాన్సలర్ డా. ఈ.సాయిబాబా రెడ్డి, వైస్‌చైర్మన్ సి.యల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్.ఎం.వి. నారాయణ సిబ్బంది శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చాన్సలర్ గంగిరెడ్డి మాట్లాడుతూ డేటా సైన్స్ మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలు భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక సాంకేతిక విభాగాలన్నారు. ఈ సదస్సులో డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ నేచురల్ లాంగ్వేజ్ ప్రోసెసింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఉపాధ్యక్షుడుగా వేణుగోపాల్



పమాణం చేస్తున్న వేణుగోపాల్

చిట్వేలి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడుగా చిట్వేలుకు చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ నియమితులయ్యారు. శనివారం రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను విస్తృతం చేసేందుకు కృషి చేయడంతో పాటు చిట్వేలి వంటి మారుమూల ప్రాంతాల్లో సేవలను అందుబాటులోకి తేవడం, రక్తదాతలను పెంచడం వంటి కార్యక్రమాలు బాధ్యతతో నిర్వర్తిస్తామని తెలిపారు. మిత్రులు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

కల్తీ మద్యం బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం తాగి మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యం, డ్రగ్స్ రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ నమోదు తీరును పరిశీలిస్తున్న ఏపీవో పెంచలయ్య

రామాపురం, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని, లేకుంటే కూలీల ఖాతాల్లో నగదు జమ కాదని ఏపీవో పెంచలయ్య అన్నారు. శనివారం మండలంలోని చిట్లూరు, హసనాపురం, నీలకంఠ్రావుపేటల్లో ఈకేవైసీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు కావాల్సిన కూలీలు జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చునని, జాబ్‌కార్డులున్న వ్యక్తులు మరణించిన, ఇతర పట్టణాలకు వెళ్లినా వారికి జాబ్‌కార్డులో నుంచి పేర్లను తొలగించాలన్నారు. గ్రామాల్లో నీటి నిలువకు సంబంధించిన పనులపై మైనర్ ఇరిగేషన్ డిపార్టుమెంట్‌కు ప్రతిపాదనలు పంపుతామ న్నారు. అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తామన్నారు. మంజూరైన పండ్ల తోటల పెంపకానికి సంబంధించి త్వరగా గుంతలు తవ్వించి మొక్కలు నాటించి పూర్తి చేయాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఓబులేసు, టీఏలు సురేంద్రనాయుడు, చంద్రశేఖర్, నాగభూషణం, శివానందరెడ్డి, కళావతి, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పుట్టినరోజు సందర్భంగా శనివారం పేదలకు అన్నదానం చేశారు. రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, పగడాల వరలక్ష్మి, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్లు జోగినేని మణి, పగడాల వెంకటేష్, సీనియర్ నాయకుడు ఆలం రమేష్ పగడాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

రైల్వేకోడూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌ఎంఎం హైస్కూలులో శనివారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని కరకంబాడి వద్ద ఉన్న అమర ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, కీళ్లు, నరాలు, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్ తదితర వైద్యులు వచ్చి రోగులకు పరీక్షలు నిర్వహించారు. వ్యాధిని బట్టి రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నార

పచ్చ.. పచ్చగా...



చెయ్యేరు నది పరీవాహక ప్రాంతంలో విస్తారంగా సాగైన వరి పంట

- 5 వేల ఎకరాల్లో సాగైన వరి పంట
- 20 ఏళ్ల తర్వాత సస్యశ్యామలంగా చెయ్యేరు నది పరీవాహక ప్రాంతం

రాజంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి పంట పండింది. చెయ్యేరు నది ఆధారంగా మూడు మండలాల ప్రజలు సుమారు 20 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. గతంలో భారీ వర్షాలు కురుస్తుండడం, బోరుబావులు లేకపోవడం, ఎగువ ప్రాంతాల్లో అన్నమయ్య ప్రాజెక్టు ఇతర ప్రాజెక్టులు లేకపోవడం కారణంగా చెయ్యేరునది ఏడాదంతా నీటితో కళకళలాడుతూ ఉండేది. అటువంటి నదికి ఎగువ ప్రాంతాల్లో అన్నమయ్య, పింఛా తదితర అనేక ప్రాజెక్టులు కట్టడం వల్ల వర్షాకాలంలో ప్రాజెక్టులు నిండితే తప్ప దిగువ ప్రాంతాలకు నీరు వచ్చేది కాదు. ప్రధానంగా 20 ఏళ్లుగా వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర పరిణామాలు రావడంతో కనీస వర్షపాతం కూడా కురవడం లేదు. దాని వల్ల ఏడాదంతా నదికి నీరు వచ్చే పరిస్థితి లేదు. అడుగడుగునా బోరుబావులు భారీ ఎత్తున వేయడంతో ఏటిలో ఉన్న నీరంతా ఇంకిపోతోంది. ఇత్యాది కారణాల వల్ల గతంలో మూడు పంటలు పండే చెయ్యేరు నది నేడు వెలవెలబోతోంది. అయితే ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో ఒక మోస్తారు వర్షాలు కురుస్తుండడం, దాంతో పాటు అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల పడే వర్షపు నీరంతా దిగువ ప్రాంతాలైన చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాలకు చేరుతోంది. దీనివల్ల రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని సుమారు 100 గ్రామాల ప్రజలు చెయ్యేరు నీటిని ఆధారం ఊట కాలువల ద్వారా వచ్చే నీటితో విస్తారంగా వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట మూడు దశల్లో ఉంది. పులపత్తూరు, మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, తాళ్లపాక, శేషమాంబపురం, పాపరాజుపల్లె, నారాయణనెల్లూరు, నందలూరు, నాగిరెడ్డిపల్లె, పాటూరు, కుమ్మరపల్లె, ఇసుకపల్లె, మందరం, మందరం రాచపల్లె, లేబాక, టంగుటూరు, పొత్తపి, ఓబిలి, పెనగలూరు ఇలా వందకు పైబడి గ్రామాల రైతులు పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెయ్యేరు నదికి నీరు చేరి పంటలు బాగా పండిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 5 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఆ పంట అంతా చేతికొచ్చే పరిస్థితి ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నందున ఇప్పుడు మరో 5 వేల ఎకరాల పైబడి వరి పంట సాగు చేయడానికి నార్లు కూడా పోశారు. మరికొన్నిచోట్ల నాట్లు కూడా నాటారు. ఇక్కడ వరిలో అన్ని రకాలను సాగు చేస్తున్నారు. అయితే కొత్తగా బాస్మతి వరిని కూడా సాగు చేశారు. తొగూరుపేటకు చెందిన శివరామయ్య తదితర రైతులు బాస్మతి రకం వరిని కిలో రూ.200 పెట్టి సాగు చేశారు. ఈ పంట కూడా పెద్దఎత్తున పండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వెన్నుకు వచ్చిన బాస్మతి వరి



తొగూరుపేటలో సాగైన బాస్మతిరకం వరి

బాస్మతి రకాన్ని కూడా సాగు చేశాం



చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో ఈ ఏడాది విస్తారంగా వరిపంటను సాగు చేశాం. వరద నీరు భారీఎత్తున వస్తుండడంతో అనేక ఏళ్ల తర్వాత భారీ ఎత్తున వరి పంట సాగు చేశాం. నేను సుమారు ఎకరా పొలంలో కిలో రూ.200 పెట్టి బాస్మతిరకం వరి పంటను సాగు చేశాను. ఈ పంట బాగా పండింది. ఒక్కో వెన్ను జానెడు పొడవు ఉంది. ఎకరాకు కనీసం 50 బస్తాలు వచ్చే అవకాశం ఉంది. కిలో బాస్మతిరకం బియ్యానికి వందల రూపాయల్లో గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంది. అందరూ ఈ పంటను సాగు చేయడానికి విత్తనాల కోసం నేను పండించిన బాస్మతిరకం వడ్లను అడుగుతున్నారు.

- శివరామయ్య, రైతు, తొగూరుపేట.

సుదీర్ఘ కాలం తర్వాత విస్తారంగా వరి సాగు



సుదీర్ఘ కాలం తర్వాత చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వరి పంటను సాగు చేయడం శుభపరిణామం. 20 ఏళ్లుగా వర్షాలు లేకపోవడం వల్ల పంటల సాగు తగ్గింది. నాలుగేళ్ల కిందట వర్షం పడినా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో చుక్కనీరు లేకుండా వృథా అయ్యింది. ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నందున చెయ్యేరునది పరివాహక ప్రాంతాలైన మూడు మండలాల్లో వేలాది ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. విస్తారంగా వర్షాలు పడడం, దానికితగ్గట్టు ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు తెగిపోవడం వల్ల వర్షపునీరు దిగువ ప్రాంతాలకు చేరడం వల్ల ఊటకాలువలకు నీరు చేరి కావాల్సిన సాగునీరు రావడంతో తిరిగి వరిపంటను విస్తారంగా సాగు చేశారు. దీనివల్ల తిండిగింజలకు యేడాదంతా ఇబ్బంది ఉండదు.

- కొండా శ్రీసివానుసులు, మందపల్లె, రాజంపేట

ఏడాదికి ఒక దూడ.. రైతుకు లాభసాటి



పశువులకు చికిత్స చేస్తున్న వెటర్నరీ ఏడీ విశ్వేశ్వరరెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఒక దూడ రైతుకు లాభసాటి అని వాల్మీకిపురం వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పత్తేపురం గ్రామంలో పశువులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందులో 200కు పైగా పశువులకు సూడి పరీక్షలు, ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్స, దూడలకు ఏలిక పాముల నివారణ, ఆవులకు గోమార్లు, పిడుదులకు బోటాక్స్ స్ప్రే తదితర వైద్యం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆవు ఈనిన నెల నుంచీ రెండు నెలల్లోపు ఎదకు వచ్చిన ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే రైతుకు లాభసాటి అని, ఈ విధంగా ఏడాదికి ఒక దూడను పొందవచ్చన్నారు. పెయ్య దూడ పుట్టే విధంగా వీర్యకణాలు అందుబాటులో ఉన్నాయని, ఆవు ఎదకు వచ్చిన సమయాన ఈ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే పూర్తి పెయ్య దూడలే పుడతాయన్నారు. ఈ వీర్య నాలిక ఖరీదు రూ.150లకు సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సుండుపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలో జూదమాడుతున్న ఆరుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని రాచంవాండ్లపల్లె వద్ద ఉన్న మామిడి తోటలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ స్వాధీనం





ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, గాయపడ్డ నాగేశ్వర్‌నాయక్

సుండుపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికీ కాలనీకి చెందిన నాగేశ్వర్‌నాయక్‌కు శనివారం తీవ్రగాయాలయ్యాయి. పింఛా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఎలమందకు చెందిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఢీకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చి క్షతగాత్రుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తిరుపతికి రెఫర్ చేసినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఎలమంద, రొంపిచర్ల, పీలేరు, కేవీపల్లి, భాకరాపేట వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రతి రోజు పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలోని నది నుంచి, బాహుదానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ప్రమాదానికి ఇసుక అక్రమ రవాణానే కారణమని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ కృష్ణారెడ్డి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని దేవపట్ల బస్టాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిక్కం కృష్ణారెడ్డి అనే వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లికి చెందిన తిక్కం కృష్ణారెడ్డి దేవపట్ల నుంచి టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి వస్తున్న స్కూటర్ ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అతడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

క్రీడల్లో గురుకులం విద్యార్థుల సత్తా

తంబళ్లపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల్లో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో అండర్-17 బాలుర ఖోఖోలో శశినాయక్, నాగేంద్రబాబు నాయక్, వాలీబాల్, ట్రిపుల్ జంప్‌లో నిరంజన్ నాయక్, అండర్-14 యోగాలో చరణ్ సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య శిల్పా (35) కుటుంబ సభ్యులతో గొడవపడి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- కండక్టర్‌కు తీవ్ర గాయాలు...



గాయపడ్డ కండక్టర్ వెంగమణి

ఒంటిమిట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కండక్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆగి ఉన్న లారీని తిరుపతి వైపు వెళ్తున్న పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో కండక్టర్ వెంగమణి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన



మిషన్ కాంపౌండులో అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో రెండు చోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన జరగడంతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మిషన్ కాంపౌండు, టిప్పు సుల్తాన్ మైదానంలో రెవెన్యూ, ఫైర్, పోలీసు, ఎస్పీడీసీఎల్, మున్సిపల్ అధికారులు శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మిషన్ కాంపౌండు, టిప్పుసుల్తాన్ మైదానంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. సబ్‌కలెక్టర్‌కు నివేదికలు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శివప్ప, వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, బాణసంచా దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప డంప్...?

- పట్టించుకోని అధికారులు



గుర్రంకొండ-సరిమడుగు మార్గంలో మసీదు పక్కన డంప్ చేసిన కలప

గుర్రంకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కలప వ్యాపారులు ఇష్టానుసారంగా వృక్షాలను నరికేస్తున్నారు. రైతుల పొలాలు, ప్రభుత్వ భూముల్లో వృక్షాలను నరికేసి చీకటి పడగానే ట్రాక్టర్లలో ఓ చోట డంప్ చేస్తున్నారు. ఇలా డంప్ చేసిన కలపను తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా డంప్ చేసిన కలప గురించి రైతులు, ప్రజలు అధికారులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె, సరిమడుగు, గుర్రంకొండ, నడిమిఖండ్రిగ, సంగసముద్రం, శెట్టివారిపల్లె, తరిగొండ గ్రామాల్లో రోజూ చింత, మామిడి, నేరేడు, వేప, కానుగ, మర్రి వృక్షాలను రంపాలతో తొలగిస్తున్నారు.

ఇలా నరికేసిన వృక్షాలను పాలకుంటపల్లె, సరిమడుగు, తలారివాండ్లపల్లె, మార్కెట్ యార్డు, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో అక్రమంగా కలపను డంప్ చేస్తున్నారు. ఈ డంప్‌లను లారీలకు లోడ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నారు. కలప డంప్‌పై రైతులు, ప్రజలు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గుసగుసలాడున్నారు. ఈ విషయమై ఆర్ఐ సదాశివప్పనాయుడును వివరణ కోరగా సరిమడుగు మార్గంలో అక్రమంగా కలప డంప్ చేసినట్లు తన దృష్టికి రాలేదన్నారు. కలప డంప్‌ను పరిశీలించి అనుమతులు లేకుంటే సీజ్ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన ఆస్పత్రికి గ్రహణం

- భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లు
- ప్రారంభానికి నోచుకోని వైనం



ప్రారంభానికి నోచుకోని నూతన ఆస్పత్రి భవనం



శిథిలావస్థకు చేరిన పాత పీహెచ్‌సీ

చిట్వేలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి 21 పంచాయతీలున్న పెద్ద మండల కేంద్రం. కానీ ఇక్కడ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అంతంత మాత్రమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ 200 మందికి పైగా వైద్యసేవలు పొందుతున్నారు. ఇక్కడ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లయినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణం పూర్తయి కాంట్రాక్టర్ తాళాలు అప్పగించినా అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన భవనానికి గ్రహణం ఎప్పుడు వీడుతుందో అని ఎదురుచూస్తున్నారు. భవనం పూర్తయి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు నూతన భవనంలో రోగులకు వైద్యసేవలు నోచుకోలేదని ప్రజల నుంచి తీవ్రంగా విమర్శలు వినపడుతున్నాయి. కోటికి పైగా నిధులు వెచ్చించి సరికొత్తగా నూతన భవనాన్ని నిర్మించారు. భవనం పూర్తయి రోగులకు వైద్యసేవలు మెరుగ్గా అందుతాయని మండల ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్నప్పటికీ ఇంతవరకు అది ప్రారంభానికి నోచుకోలేదు. పాత భవనంలో పూర్తిగా పాడవడంతో వర్షం కురిస్తే చాలు భవనంపై పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోనని భయంతో సిబ్బంది, అటు రోగులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న మరమ్మతులు చేసుకుంటూ తాత్కాలికంగా పాత భవనంలో వైద్యసేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చింది త్వరలో నూతన భవనంలో వైద్యసేవలు అందుతాయనుకున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన నూతన భవనంలో వైద్యసేవలు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో పసికందు మృతి

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన
- చిన్నారి బంధువుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు



మృతి చెందిన పురిటిబిడ్డ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కళ్లు తెరవకనే పసికూనను కడతేర్చిన సంఘటన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జరిగింది. బాధితులు మదనపల్లె టూటౌన్ పోలీసులకు డాక్టర్ల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె కుమ్మరవీధికి చెందిన ప్రసాద్, కవిత దంపతులకు మొదటి కాన్పులో ఆడబిడ్డకు సాధారణ ప్రసవం జరిగింది. తిరిగి 11 ఏళ్ల తరువాత గర్భం దాల్చి రెండో ప్రసవం కోసం శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మధ్యాహ్నం 3 గంటలకు వచ్చారు. పరీక్షలు చేసిన డాక్టర్లు అంతా సవ్యంగా ఉందని, తొందర ఏమీ లేదని తెలిపారు. బాధితులు రాత్రి 6 గంటలకు కూడా ఏమైనా ఇబ్బంది ఉంటే మరోచోట చూపించుకుంటామని డాక్టర్లతో చెప్పారు. నొప్పులు వస్తున్నాయి ఆలస్యంగా కాన్పు అవుతోందని, తొందరపడితే కాదని చెప్పడంతో మిన్నకుండిపోయారు. శనివారం కడుపులో బిడ్డ కదలలేదని గుర్తించి పది గంటలకు కాన్పు చేశారు. అప్పటికే బిడ్డ చనిపోయింది. పసికందు కనులు తెరవకనే డాక్టర్లు కడతేర్చారని బాధితులు వాపోయారు. ఎన్నో ఏళ్ల తరువాత గర్భం నిలిస్తే డాక్టర్లు గర్భశోకం మిగిల్చారని విలపించారు. డాక్టర్లపై కేసు నమోదు చేయాలని బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

దర్జాగా ప్రభుత్వ భూమికి కంచె...

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కంచెను తొలగించిన అధికారులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి



కంచెను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఒంటిమిట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు అక్రమార్కులు అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వాలు మారినా అక్రమార్కులు మాత్రం మారడం కారణం ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో వారు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నారు. మండలంలోని గొల్లపల్లి, ధవంతంపల్లి గ్రామాల్లో సర్వే నెం-78, 662లో అక్రమార్కులు కన్నేసి దర్జాగా ప్రభుత్వ భూములను ఆక్రమించారు.

కొండను సైతం పిండి చేశారు యంత్రాల సాయంతో చదును చేసి కంచెను కూడా ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉంది. మండల కేంద్రమైన ఒంటిమిట్ట నుంచి పది కిలోమీటర్ల లోపే ఉన్న ఈ గ్రామాలలో భూఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటి వెనుక ఎవరి హస్తమున్నదో అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. సర్వే నెం.78లో గొల్లపల్లి గ్రామానికి చెందిన తోప్పెన అన్నపూర్ణమ్మ పేరుతో సుమారు 13 ఎకరాలు ఆక్రమించేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన తుంగ గోపయ్య మూడు ఎకరాలు ఆక్రమించారు. ధవంతంపల్లి గ్రామంలోని 662 సర్వే నెంబర్‌లో 4 ఎకరాలు వెంకటసుబ్బయ్య ప్రభుత్వ భూమిని అక్రమించుకుని చదును చేశారు. ఈ సమాచారం రెవెన్యూ అధికారులకు ఆలస్యంగా తెలియడంతో రంగప్రవేశం చేసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి కంచె తొలగించారు. ఈ విషయమై తహసీల్దార్ దామోదర్ రెడ్డిని వివరణ కోరగా ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించి కంచెను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

సీకేదిన్నె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మంగళి లక్ష్మీదేవి(40) మృతి చెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు... చింతకొమ్మదిన్నె మండలం బుగ్గవంకలో శనివారం మేకల కాపరి మేకలు మేపుకుంటుండగా ఓ గుర్తు తెలియని శవాన్ని చూసి సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించాడు. దీనిపై పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం గతంలో ఈ నెల 4వ తేదీన మహిళ అదృశ్యంపై నమోదైన కేసు తరుపు బంధువులను పిలిపించి చూపించగా చనిపోయిన వ్యక్తి మామిళ్లపల్లె జగనన్న కాలనీకి చెందిన మంగళి బుగ్గరమేష్ భార్య లక్ష్మీదేవిగా గుర్తించారు. కర్నూలు జిల్లాకు చెందిన వీరు పది సంవత్సరాల క్రితం కడపకు వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నట్లు వారి బంధువులు తెలిపారు. బుగ్గరమేష్, అతని కుమారులు ఇద్దరు ఇందిరానగర్‌లో హెయిర్‌కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని, ముగ్గురు మూడు కటింగ్ షాపులు నిర్వహిస్తూ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. అయితే రమేశ్ తాగుడుకు అలవాటుపడి మానకపోవడంతో సెప్టెంబరు 30న ఇంటిలో గొడవ జరిగిందని, మద్యం వ్యసనం మానుకోవాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకపోవడంతో ఆరోజు రాత్రి అందరు పడుకుని తెల్లవారి లేచేసరికి 1వ తేదీ మంగళి లక్ష్మీదేవి కనిపించకుండాపోవడంతో వారి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతికి, బంధువుల ఇండ్ల వద్ద విచారించి చివరకు 4వ తేదీన పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కనిపించకుండా పోయిన మహిళ శనివారం బుగ్గవంకలో మరణించిందనే విషయం తెలుసుకుని వారి బంధువులను పిలిపించి నిర్ధారించుకున్న తర్వాత మృతదేహం కుళ్లి వాసన వస్తుండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే క్యాంటీన్ సేల్స్‌మ్యాన్ ఆత్మహత్య


మృతి చెందిన సురేశ్

ఎర్రగుంట్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ క్యాంటీన్‌లో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్న కంభం సురేశ్(32) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన సురేశ్ స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాల పక్కనున్న రైల్వే క్యాంటీన్‌లో ఓ గదిలో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. క్యాంటీన్ నడుపుతున్న యాజమానికి సురేశ్ డబ్బులు బాకీ ఉన్నాడు. కానీ కొంతకాలంగా సురేశ్ ఇక్కడ పనిచేయకుండా వెళ్లిపోయాడు. అకస్మాత్తుగా ఇటీవల కడపలో సదరు యజమానికి సురేశ్ కనిపించగా కొట్టి, మందలించి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చినట్లు సీఐ తెలిపారు. డబ్బు కట్టలేనని, అయితే ఎర్రగుంట్లకే వచ్చి క్యాంటీన్‌లో పని చేస్తానని తెలిపి ఇక్కడికి వచ్చి పని చేస్తున్నాడన్నారు. అయితే కొట్టినందుకు మనస్థాపం చెందాడా లేక మరేం జరిగిందో కాని శుక్రవారం రాత్రి ఇంట్లోని ఓ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ వివరించారు. వీఆర్‌వో విజయభాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

టపాసుల అక్రమ నిల్వలపై దాడి


పట్టుబడిన టపాసులు, పేలుడు పదార్థాలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాసనగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను టూటౌన్ సీఐ సదాశివయ్య ఆధ్వర్యంలో శనివారం సీజ్ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసనగర్‌లో షేక్ నూర్ జహాన్, ఆమె కుమారుడు షరీఫ్ లైసెన్సు లేకుండా పేలుడు పదార్థాలు బయటనుంచి తీసుకువచ్చి అక్రమంగా నిల్వ చేసుకున్నారు. అలాగే టపాసులు చేయడానికి మందుగుండు సామగ్రిని కూడా ఇంట్లో భద్రపరిచారు. ఈ మేరకు సమాచారం రావడంతో శనివారం సీఐ ఆధ్వర్యంలో దాడులు చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు షేక్ నూర్‌జహాన్, ఆమె కుమారుడు షరీఫ్‌లపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఎవరైనా లైసెన్సు లేకుండా ఇళ్లలో టపాసులు, మందుగుండు సామగ్రి ఉంచుకున్నా, తయారు చేసినా సమాచారమివ్వాలని కోరారు.

కానిస్టేబుల్‌పై దాడి

● ఇరువురిపై కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేటకు చెందిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కడప టూటౌన్‌లో పనిచేస్తున్న బ్లూకోల్ట్ కానిస్టేబులు నాలుగు రోజులక్రితం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మాసాపేట వద్ద ఓ పెళ్లి ఫంక్షన్‌లో కొందరు డ్యాన్స్ చేస్తుండగా బ్లూకోల్ట్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి మరో వ్యక్తి కలిసి ఆ కానిస్టేబులుపై దాడి చేశారు. కానిస్టేబులు ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... శనివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో 50 సంవత్సరాల గుర్తు తెలియని మహిళ కనుమలోపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో కడప-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు అడ్డంగా వెళ్లి దాని కిందపడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కడప రిమ్స్ మార్చురీ గదికి తరలించారు. అయితే ఈమె వద్ద ప్లాస్టిక్ సంచిలో ప్లాస్టిక్ బాటిళ్లు ఉండడంతో ఆమె ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని జీవనం సాగించే మహిళగా తెలుస్తోందన్నారు. వివరాలు తెలిసిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్

మైదుకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరు బస్టాండు ప్రాంగణంలో నిలిపిన ద్విచక్ర వాహనాల యజమానులకు శనివారం సీఐ రమణారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల ద్విచక్ర వాహనదారులు పబ్లిక్ ప్రదేశాలలో బాధ్యతారహితంగా భద్రత లేకుండా పార్కింగ్ చేయడం వలన దొంగతనాలు జరుగుతుండటంతో స్పందించిన సీఐ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సైడ్‌లాక్ వేయకుండా పార్క్ చేసిన మోటారు సైకిళ్లను ఒకచోటకు తీసుకువచ్చి, వాహనాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కచ్చితంగా మోటారు సైకిళ్లకు సైడ్‌లాక్ వేసుకోవాలని, పోలీసు సూచనలు పాటించాలని ఆయన కోరారు.

పుట్టి మునిగింది..

● దళారులు చెప్పిందే ధర
● నష్టపోతున్న రైతులు

ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారుల పాలవుతోంది. రైతు కష్టపడి పండించిన ధాన్యానికి దళారులే ధర నిర్ణయిస్తున్నారు. వారు చెప్పిన ప్రకారమే కర్షకుల కష్టం అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో పుట్టి ధాన్యానికి (8బస్తాలు) పదివేల రూపాయలకు పైగా ఖరీఫ్ రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ప్రకటించినా రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ధర పెంచాలని కోరినా ససేమిరా అంటున్నారు. దళారులు చెప్పిన ధరతో పుట్టి ధాన్యం నష్టంతో అమ్ముకోవాల్సిన పరిస్థితి. రైతులకు నష్టాల బాధ తప్పలేదు.


లారీలోకి ధాన్యం బస్తాలు ఎక్కిస్తున్న వైనం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

చెన్నూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కేసీ కెనాల్‌కు కాసింత నీరు రావడంతో ఆయకట్టు కింద మండల వ్యాప్తంగా 3600 ఎకరాలకు పైగా వరి సాగు చేపట్టారు. వారంరోజులుగా ఈ వరి పంట కోతలు మొదలయ్యాయి. ఇప్పటికే చెన్నూరుతో పాటు కనుపర్తి, దౌలతాపురం, బలసింగాయపల్లె, రామనపల్లె ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. అయితే వరి ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దు, గిట్టుబాటు ధర కల్పిస్తామని కూటమి ప్రభుత్వం పదే పదే చెబుతున్నా రైతులు కోసిన వెంటనే ధాన్యాన్ని అమ్ముతున్నారు. దళారులు ఇదే అదునుగా భావించి ధర తగ్గించి కొనగోలు చేస్తున్నారు. పదిరోజుల క్రితం మొదటి దశగా వరికోత చేపట్టగా ఆ తరువాత రెండు రోజులకే పుట్టి ధాన్యం (8బస్తాలు) రూ.11,600 వంతున దళారులు కొన్నారు. ప్రభుత్వం మాత్రం ఎక్కువ ధర ఇస్తామని చెప్పడంతో ఈ విషయం రైతులు దళారులకు చెప్పి కాసింత ధర పెంచాలని కోరినా ససేమిరా ఒప్పుకోకపోగా మేం చెప్పిందే ధర, అమ్మితే అమ్మండి.. లేదంటే లేదంటున్నారు దళారులు. గతి లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముతున్నారు.

మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలు

మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యం కొనేందుకు చెన్నూరుతో పాటు రామనపల్లెలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే కలెక్టరు ప్రకటించారు.

పుట్టికి నష్టం

పుట్టి ధాన్యాన్ని నష్టంతో అమ్ముకుంటున్నాడు. ప్రభుత్వం మాత్రం రూ.14వేలకు పైగానే కొంటామంటోంది. అయితే అప్పు చేసి సాగు చేసిన రైతు పంటను అమ్మి కొంత వరకైనా అప్పు తీర్చాలని దళారులకు విక్రయిస్తున్నాడు. పైగా ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు పుట్లు (32 బస్తాలు) మించి దిగుబడి రాలేదు. ఖర్చు ఎకరాకు రూ.30వేలకు పైమాటే. నాలుగు నెలల పాటు కష్టపడ్డ రైతుకు ఎకరాకు మిగిలింది ఐదువేల వరకు వచ్చినా కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాని పరిస్థితి.

మంచి గిట్టుబాటు ధర అందిస్తుంది..

పండించిన పంటకు ప్రభుత్వం మంచి గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ప్రభుత్వం గ్రేడ్ ఎ రకం క్వింటా రూ.2389 అందిస్తుంది. అయితే దళారులకు అమ్మితే క్వింటా రూ.1813కే అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో రైతు నష్టపోవాల్సిందే. కాసింత ఓపిక పడితే ప్రభుత్వమే కొని మంచి గిట్టుబాటు ధర ఇస్తుంది. రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దు. ఇప్పటికే రైతులకు ఈ విషయం తెలిపాం. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఏం చేయాలో అన్ని చర్యలు తీసుకుంటుంది.

- ఎ.శ్రీదేవి,
మండల వ్యవసాయాధికారి, చెన్నూరు

ఉధృతంగా కుషావతి

● రాకపోకలకు అంతరాయం


కుషావతినదిలో ప్రయాణికులను దాటిస్తున్న పోలీసులు, స్థానికులు

పెద్దమండ్యం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెద్దమండంలో ఉదయం శనివారం కుషావతి నది మళ్లీ ఉధృతంగా సాగుతోంది. ప్రవాహం ఉధృతికి వాహనాలు, ప్రయాణీల రాకపోకల స్థంభించాయి. శుక్రవారం, శనివారం తెల్లవారు జామున వర్షం కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు కుషావతినదికి చేరడంతో పెద్దమండ్యం-గుర్రంకొండ రహదారిలో కుషావతినది ప్రవాహంతో ప్రజల రాకపోకలకు ఒక రోజు అంతరాయం కలిగింది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణాలు ఆగాయి.

ఏటా వర్షకాలంలో ఇక్కడ ప్రయాణీలకు కష్టాలు ఇలానే సాగుతున్నాయి. సిద్దవరం పంచాయతీలోని వర్షపునీటితో నిండిన ప్యాటచెరువు మొరవ పోతే ప్రమాద పరిస్థితి ఉందని రైతులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, రైతులు పరిశీలించారు. ఎఫ్ఈఎస్ సంస్థ ఆధ్వర్యంలో 5మీటర్ల రాతి కట్టడం పనులు జరగాల్సి ఉందని తెలిపారు. పెద్దమండ్యం పాతచెరువు, కలిచెర్ల పాపిరెడ్డిచెరువు తదితర చెరువులు మొరవలు పోతున్నాయి. సాయంత్రం ప్రవాహం తగ్గు ముఖం పడడంతో తరవాత ఖాన్, కృష్ణమూర్తి, స్థానికులు వృద్ధులకు, పిల్లలకు నది ప్రవాహం దాటించారు. మండల అధికారులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి : నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కండక్టర్‌పై నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చినట్లు పోలీసులు తెలిపారు. శనివారం మదనపల్లె- మొట్టుకుపల్లె సర్వీసు మొట్టుకుపల్లె వెళ్లి తిరిగి మదనపల్లె వస్తుండగా చీకలబైలు వద్ద చాదబావి స్టేజ్‌లో నలుగురు యువకులు బస్సు ఎక్కి, బస్సు చివరి సీట్లో ఉన్న మహిళలను అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. ఆ బస్సు కండక్టర్ బి.కొత్తకోట మండలం, కరెంటు కాలనీ వాసి పెద్దపాళెం శ్రీరాములు వారించాడు. దీంతో యువకులు నీవు ఎవర్రా మాట్లాడడానికి టిక్కెట్లు కొట్టేపని చూసుకోమని నానా దుర్భాషలాడారని, బస్సును పోలీసు స్టేషన్‌కు వెళ్లమనగా ఎక్కడికిరా వెళ్లేదంటూ డ్రైవర్‌ను, కండక్టర్ శ్రీరాములను కాళ్లతో తన్ని, చేతులతో చితకబాదారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సులో ఎంతమంది అడ్డుకున్నా ఖాతరు చేయలేదని వారు వాపోయారు. ఇందులో తలారి భానుప్రకాష్, భరత్ కుమార్, రాజేష్ సహా మరొకరిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

బతుకు తెరువు కోసం వచ్చి బలి

● విద్యుదాఘాతంతో కడప జిల్లా వ్యక్తి మృతి


మృతి చెందిన జనార్ధన్ ఫైల్‌ఫొటో

కుందుర్పి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఓ వ్యక్తి ఊరుగాని ఊరికి వచ్చి బలైపోయిన సంఘటన శనివారం అనంతపురం జిల్లా కుందుర్పిలో జరిగింది. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుదాఘాతంతో కడపజిల్లాకు చెందిన కూలీ జనార్దన్(43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పిలో నూతన విద్యుత్ లైను ఏర్పాటు పనులను కాం ట్రాక్టర్ రమేష్ గత కొన్ని రోజులుగా చేయిస్తున్నాడు. ఈ పనులు చేసేందుకు దినకూలీగా కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం కె.సుగుమంచుపల్లికి చెందిన జనార్దన్ వచ్చాడు. భార్య, పిల్లలు సొంతూరులో ఉండగా జనార్దన్ తోటి కార్మికులతో కలిసి కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తుండగా జనార్దన్ విద్యుదా ఘాతానికి గురయ్యాడు. దీంతో ఆయన్ను అనంతపురం సర్వజనా స్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలి పారు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. జనార్దన్ మృతి వార్తను భార్య, బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అనంతపురం ఆస్పత్రికి చేరుకున్నారు. కొన్ని నెలలుగా తన భర్తకు కూలి కూడా ఇవ్వలేదని మృతుడి భార్య ఆరోపించారు. న్యాయం చేయమని అడిగితే బీమా పేరుతో కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడని కన్నీటి పర్యంతరమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

● అదుపులోకి తీసుకున్న పోలీసులు



కడప నాగరాజుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడప నగ రంలోని ఎస్పీ బంగ్లా వద్ద ఓ యువకుడు నడిరోడ్డుపై వాహ నాలు ఆపి వీరంగం సృష్టించా డు. మద్యం మత్తులో రోడ్లపై కార్లు ఆపి కేకలు వేశాడు. తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, తన భార్య వదిలేసిందని, తన కూతురు చనిపోయినా కూడా ఎవరూ చెప్పలేదంటూ ఆక్రోషించాడు. దీంతో విషయం తెలుసు కున్న వన్‌టౌన్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

టాలెంట్ హంట్ వాయిదా

కడప స్పోర్ట్స్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న మెన్స్ సెలక్షన్ అండర్-12, 14, 16, 19 టాలెంట్ హంట్ వాయిదా పడినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ టాలెంట్ హంట్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

తల్లి మందలించిదని... కొడుకు ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం సోములవారి పల్లె పంచాయతీ ఈశ్వర్ రెడ్డి నగర్‌లో నివాసం వుండే ఇమాంబాషా అలియాస్ మున్నా (22) అనే యువకుడు చెడువ్యసనాలకు బానిసైనందున తల్లి మందలించిందని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డి నగర్‌లోని మాబున్నా, గౌస్‌బాషా దంపతులకు ఇద్దరు పిల్లలు వున్నారు. గౌస్‌బాషా బతుకుదెరువు కోసం కువైట్‌లో వుంటున్నాడు. తల్లి మాబున్నా ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. కుమారుడు ఇమాంబాషా అలియాస్ మున్నా చదువును మధ్యలోనే ఆపేసి చిన్నచిన్న పనులు చేసేవాడు. ఈక్రమంలో చెడువ్యసనాలకు బానిసై ఇంట్లో నుంచి వెళితే వారం రోజులు ఇంటికి రాకుండా బయట బయటే తిరుగు తుండేవాడు. ఈ క్రమంలో తల్లి మందలించడంతో శుక్రవా రం ఇంట్లో నుండి వెళ్లి ఎర్రగుంట్ల రోడ్డులోని ఫారెస్టు ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి మాబున్నా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

బద్వేలుటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి నెల్లూరు రోడ్డులో శనివారం పాతిమా చర్చీ ఎదురుగా ఆయిల్ ట్యాంకర్‌ను ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు అద్దాలు పగిలాయి. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతిన్నా ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

కమిటీ నిర్లక్ష్యం - అభివృద్ధికి దూరం

ఏ అభివృద్ధీ పట్టని ఆస్పత్రి కమిటీలు ● నిధులు మంజూరైనా ఆస్పత్రులకు చేరని వైనం ● నామమాత్రంగా కమిటీ సమావేశాలు ● నిధుల విడుదలపై నిర్లక్ష్యం ● వైసీపీ ప్రభుత్వంలో కమిటీల నియామకమే కారణమా?

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి కోసం ప్రత్యేకించి కమిటీ ఏర్పాటు చేస్తుంటారు. ఈ కమిటీ ద్వారానే ఆస్పత్రుల్లో అభివృద్ధి పనులు, చివరికి మందుల కొనుగోలు కూడా జగరుతుంటోంది. అయితే ప్రస్తుత కమిటీని వైసీపీ ప్రభుత్వమే నియమించడంతోనే సమావేశాల నిర్వహణపై, మందుల కొనుగోలుకు కావాల్సిన నిధులు విడుదలపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కొన్ని రకాల మందులకు నిధులు విడుదలైనా ఆస్పత్రులకు మందులు చేరడం లేదనే ఆరోపణలున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కమిటీ సమావేశాలను నామమాత్రంగా నిర్వహించి చేతులు దులిపేసుకోవడంతో జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి నిధులు విడుదలవుతున్నా అవి మురిగిపోతున్నాయి. వివరాల్లోకెళితే...

మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఒకటి మండల కేంద్రం పెద్దతిప్పసముద్రంలో ఉండగా మరొకటి కందుకూరులో ఉంది. పెద్దతిప్పసముద్రం పరిధిలో రంగసముద్రం, మల్లెల, వరికసువుపల్లె, బూర్లపల్లె, విసనకర్రవాండ్లపల్లెలున్నాయి. కందుకూరు పరిధిలో మద్దయ్యగారిపల్లె, టి.సదుం, కమ్మచెరువు, పట్టెంవాండ్లపల్లె, కాట్నగల్లు గ్రామాలున్నాయి. వీటికి తక్షణం మందుల కొనుగోలుకు ఆస్పత్రుల్లో మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర మౌలిక వసతుల కోసం ఖర్చు చేసేందుకు ఏటా జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ. 1.75 లక్షలు ప్రభుత్వం అందిస్తోంది. ఈ కమిటీల్లో ఎంపీపీ చైర్మన్గా, సీనియర్ డాక్టర్ కన్వీనర్గా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్, మహిళా సర్పంచ్లు కమిటీలో ఉంటారు. అభివృద్ధి కమిటీ సమావేశాల ఆమోదంతో ఈ నిధులను అత్యవసర మందులు కొనుగోలు, వసతుల కల్పనకు వినియోగించాల్సి ఉంటుంది.




నిరుపయోగంగా ఉన్న మల్లెల ఆరోగ్య ఉపకేంద్రం - పెద్దతిప్పసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నామమాత్రంగా కమిటీ సమావేశాలు

వైసీపీ ప్రభుత్వంలో ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ సమావేశాలు నామమాత్రంగా నిర్వహించి చేతులు దులిపేసుకునే వారు. దీంతో అభివృద్ధి కుంటుబడడం, కనీస వసతులకు నోచుకోక పోయేది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీల్లో అధిక శాతం సభ్యులు వైసీపీ ప్రభుత్వం నియమించిన వారే ఉండడంతో కమిటీ సమావేశాలను, ఆస్పత్రిల్లో మౌలిక వసతులు, సమస్యలపై పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులను ఇష్టారాజ్యంగా మరమ్మతుల పేరుతో నిధులను మింగేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఆస్పత్రుల కమిటీలు ఒకసారి కూడా సమావేశాలను నిర్వహించి తీర్మానాలు చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కావడం లేదని, దీంతో ఆస్పత్రుల్లో ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చి ఏడాదిన్నరవుతున్నా కమిటీల ను మార్చకపోవడం కొసమెరుపు.

మరమ్మతుల పేరుతో నిధుల స్వాహా

వైసీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ నిధులను గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ ఆస్పత్రిలో మరమ్మతుల పేరుతో ఉన్న నిధులను ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులను స్వాహా చేసినట్లు సమాచారం. ఆస్పత్రుల్లో పూర్తి స్థాయి అభివృద్ధి జరగాలంటే ప్రస్తుత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని నియమిస్తే ఆస్పత్రులు అభివృద్ధి సాధిస్తాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్రాలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం, ప్రతి గ్రామాల్లో విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఆయా గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. రంగసముద్రం బస్టాండులో పాత భవనంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ భవనం నేడు శిథిలావస్థకు చేరింది. మల్లెల గ్రామంలో అప్పట్లో లక్షలు వెచ్చించి ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్మించారు. దాన్ని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఇలాంటి భవనాలు మండలంలోని వివిధ గ్రామాల్లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా మండలంలోని వివిధ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలను ఉపయోగంలోకి తీసుకుని వస్తే గ్రామీణులకు వైద్య సేవలు మెరుగుపడతాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

కల్వర్ట్ మూసివేతతో ఆలయంలోకి వర్షపు నీరు

వాల్మీకిపురం, అక్టోబరు 11: పట్టణ సమీపంలోని మదనపల్లె మార్గంలో ఉన్న పింగాణి ఫ్యాక్టరీ వద్ద ఎంతో కాలంగా ఉన్న కల్వర్టు పూడ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నివాసాల నడుమ ఉన్న అమ్మ వారి ఆలయం వద్ద కల్వర్ట్ మూసివేయడంతో వర్షపునీరు ఆలయంలోకి చేరి దుర్గంధం వెదజల్లుతోందని, ఇబ్బందిగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కగా ఉన్న కల్వర్ట్ మూసేయడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన కల్వర్ట్ ప్రాంతాన్ని పరిశీలించి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




వాల్మీకిపురం-మదనపల్లె మార్గంలో కల్వర్ట్ మూసేసిన దృశ్యం - జాతీయ రహదారి పక్కన నివాసాల్లోకి వర్షపు నీరు

నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయం



వాల్మీకిపురంలో సబ్స్టేషన్ మరమ్మతులు పర్యవేక్షిస్తున్న ట్రాన్స్కో ఏఈ రాజశేఖర్

వాల్మీకిపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని ట్రాన్స్కో ఏఈ రాజశేఖర్ అన్నారు. పునుగుపల్లె విద్యుత్ సబ్స్టేషన్ మొదలుకొని మండలంలోని చింతపర్తి, కూరపర్తి, నగిరిమడుగు, టి.సాకిరేవుపల్లె, గండబోయనపల్లె, తదితర సబ్స్టేషన్లలో పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టారని ఏఈ అన్నారు. పట్టణంలో విద్యుత్ లైన్లకు సమస్యాత్మకంగా మారిన చెట్ల తొలగింపు, లోవోల్టేజీ సమస్యలన్నింటినీ పరిష్కరించామన్నారు. ప్రజలకు ట్రాన్స్కో సిబ్బంది అందు బాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు, రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. లైన్మెన్లు శంకర, రమణారెడ్డి, కుమార్, దాము, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన పాలగిరి సిద్ధా



చంద్రబాబుతో పాలగిరి సిద్ధా

ములకలచెరువు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా కలిశాడు. అమరావతిలోని సచివాలయం వద్ద ముఖ్యమంత్రిని కలిసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లాడు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వ్యవహారం గురించి చంద్రబాబు ఆరా తీశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కలకడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కలకడ కొత్తపల్లెలోని కోదండ రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠను శనివారం వేదోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు విశ్వక్సేన, ఆరాధన, హోమాలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. సమీప గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మదనపల్లి ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బండి బాలాజీ, సమరసత సేవా ఫౌండేషన్ ప్రభుత్వ సంబధాల ప్రముఖులు చీపాటి వెంకటరమణారెడ్డి, జిల్లా కన్వీనర్ శ్రీధర్ రాజు, సహసంయోజక్ రెడ్డెప్పరావు, జిల్లా ప్రచారకులు కర్రె శ్రీనివాసులు, వెంకటరమణ, ప్రముఖ న్యాయవాది, శ్రీపుష్పగిరి తీర్థక్షేత్ర ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు భారవి, ధ్వజస్తంభ దాతలు పొన్నపల్లి, వడ్డే, నీరుగట్టు కుటుంబీకులు, ప్రజలు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా కలిగిఉండాలి



గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

కలకడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయంలో ఆటో డ్రైవర్లు రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ సభ్యులైన ఆటో డ్రైవర్లకు శనివారం గుర్తింపు కార్డులను అందజేసిన ఎస్ఐ మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు, అక్రమ రవాణా గురించి పోలీసులకు తెలపాలన్నారు. ప్రతి ఒక్కరూ యూనిఫారం ధరించడం, వాహనాలను అతి వేగంతో నడపరాదని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల సేవా పథకం కింద రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఆటో డ్రైవర్లకు అందించిన కూటమి ప్రభుత్వానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ అభినందన తెలిపారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, వెంకటేష్, జలాలుద్దీన్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కక్షగట్టిన పేర్ని నాని

కలికిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలపై మాజీ మంత్రి పేర్నినాని విషం కక్కుతున్నాడని, దీని పరిణామాలు కూడా తీవ్రంగానే వుంటాయని రాష్ట్ర జంగమ సక్షేమ కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ విమర్శించారు. బీసీ కులస్తుడనే చిన్నచూపుతోనే మచిలీపట్నం సీఐ పట్ల అవమానకరంగా ప్రవర్తించాడని ఆరోపించారు. సీఐ ఏసుబాబుతో పోలీసు స్టేషన్లోనే పేర్ని నాని దురుసుగా ప్రవర్తించి వివాదాస్పదమైన సంఘటనపై స్పందించిన ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో వేలాది టన్నుల పేదల బియ్యాన్ని బొక్కేసిన సంగతి రాష్ట్రమంతా తెలుసని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో బీసీ అభ్యర్థిపైన ఓటమి చెందిన పేర్ని ఆ కులాలపై అక్కసు పెంచు కున్నట్లు కనబడుతోందన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు సాగవని తెలిసి ప్రజల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని ప్రజలు గుర్తించాలన్నారు. గతంలో తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్లాంటి బీసీ నేతలను పొట్టన పెట్టుకున్నారని గుర్తు చేశారు. బీసీ, ఎస్సీలను అణచివేయాలని వైసీపీ పాలనలో తీవ్ర ప్రయ త్నాలు జరిగాయని ఆరోపించారు. విధుల్లో వున్న సీఐ ఏసుబాబును బెదిరించడం, విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను కోరారు.

బస్ షెల్టర్ నిర్మాణాన్ని అడ్డుకున్న టీడీపీ నేత



ప్రభుత్వ స్థలంలో బస్షెల్టర్ కోసం కొలతలు తీస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాలినాయునిపల్లెలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ స్థలంలో నిర్మించనున్న బస్షెల్టర్ను టీడీపీ నేత సాకల రఘు అతని కుమారుడు ప్రతాప్ అడ్డుకుని పీఆర్ ఏఈ నాగరాజును వెళ్లిపోవాలనడం, గ్రామస్తులతో ఘర్షణకు దిగి ఆస్థలంలో వేసిన కొలతలను తొలగించడం చర్చనీ యాశమైంది. గ్రామస్తులు మాట్లాడుతూ బాలినాయునిపల్లి సమీప రోడ్డుకు వున్న సర్వే నెంబరు 810-3లో 0.5సెంట్ల ప్రభుత్వ భూమి వుంది. ఈ భూమిలో వాటర్ప్లాంట్, బస్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అనుమతులు ఇచ్చి, నిర్మాణానికి రూ.3లక్షలను కేటాయించినట్లు తెలిపారు. అయితే ఈ స్థలాన్ని కాజేయాలని అదే గ్రామానికి చెందిన సాకల రఘు అతని కుటుంబ సభ్యులు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. అయితే ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారు లు సర్వే చేసి ప్రభుత్వ స్థలంగా తేల్చారు. గతంలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు వాటర్ ప్లాంట్ నిర్మాణాలు చేపడుతుంటే వాటిని కూడా అడ్డుకున్నట్లు తెలిపారు. కొందరు టీడీపీ నేతల అండతోనే అతను రెచ్చిపోయి కొలత తీసిన పీఆర్ ఏఈని అడ్డుకుని కొలతలను కూడా తొలగించినట్లు తెలిపారు. ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడి ఎవరైనా ఈ స్థలం జోలికివస్తే వారి అంతు చూస్తానని బెదిరించడం కొసమెరుపు. దీంతో చేసేదిలేక కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కరాటేలో విద్యార్థికి గోల్డ్మెడల్



వందనపల్లె టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో మదనపల్లె విద్యార్థి మజహర్అలి గోల్డ్మెడల్ సాధించాడు. ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ కొలిజియేట్ పోటీల్లో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి మజహర్ అలి పాల్గొన్నారు. కరాటే కుమితే 84 కిలోల విభాగంలో అలి ప్రతిభ కనపరచి గోల్డ్ మెడల్ సాధించాడు. ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్నాయక్, జగదీష్ విద్యార్థిని అభినందించారు.

పీఎం ధన్ధాన్య పథకం రైతులకు వరం



మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్ను అభినందిస్తున్న రాందాస్చౌదరి, నరసింహారెడ్డి

మదనపల్లె టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ప్రధాన మంత్రి ధన్ ధాన్య యోజన్ రైతులకు వరంలాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ పేర్కొన్నారు. శనివారం మార్కెట్యార్డులోని సమావేశ భవనంలో బీజేపీ, జనసేన, టీడీపీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు, పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచే రెండు వేర్వేరు పథకాలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేడు ప్రారంభించారన్నారు. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్చౌదరి మాట్లాడుతూ మోదీ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ రెండు పథకాల ద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. ప్రధాని మోదీ ఈ రెండు పథకాలను ప్రారంభించే వీడియో కాన్ఫరెన్స్ను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎన్.సేతు, జేకే వర్మ, బర్నేపల్లె రవి, పూల నాగరాజు, లక్ష్మీపతి, మార్కెట్యార్డు కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి అభిలాష్, రైతులు పాల్గొన్నారు. అంతకు ముందు మార్కెట్ కమిటీ చైర్మన్గా నియమితులైన జంగాల శివరామ్ను రాందాస్చౌదరి, చల్లపల్లె నరసింహారెడ్డి అభినందించారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

మొక్కలు నాటిన జింకా వెంకటాచలపతి



మొక్కలు నాటుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం పురస్కరించుకుని మున్సిపల్ వైస్చైర్మన్ జింకా వెంకటాచలపతి మొక్కలు నాటారు. ఎన్వీఆర్ లేఅవుట్లో శనివారం కేక్ కట్ చేసి పార్టీశ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ పెద్దాయన జన్మదినం పురస్కరించుకుని పర్యావరణ సంరక్షణ దృష్ట్యా భవితరాలకు ఆక్సిజన్ అందించడానికి మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కౌన్సిలర్లు జింకా రాధమ్మ, పి.రాజేష్, మాజీ కౌన్సిలర్ ఎన్.బాలగంగాధర్రెడ్డి, మైనార్టీ నేత రహంతుల్లా, పవన్, విష్ణు, గని, రిచర్డ్, కత్తి మంజు, ఎన్వీఆర్లేఅవుట్ అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ట్రెజరర్ బెంజమిన్, నరసింహులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



పీలేరులో కేక్ కట్చేసి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు చేసుకుంటున్న వైసీపీ నేతలు

పీలేరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు పీలేరులో నిర్వహించారు. శనివారం పీఎల్ఆర్ అపార్ట్మెంట్ వద్ద కేక్ కట్చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. సమావేశంలో పీలేరు జడ్పీటీసీ సభ్యుడు రత్నశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం అందించిన ప్రత్యేక చొరవ మరువలేనిదన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చక్రధర్, రాజంపేట ఎంపీ పీఆర్ఓ ఉదయ్కుమార్, నేతలు లోకనాథరెడ్డి, భువనేశ్వర్రెడ్డి, విక్టరీ వెంకట్రమణారెడ్డి, ఆనంద్, కాలనీ చిన్న పాల్గొన్నారు.

టీకాలు సకాలంలో వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి విక్రమ్రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పశువులకు టీకాలు సకాలంలో వేయించాలని మండల పశు వైద్యాధికారి విక్రమ్రెడ్డి సూచించారు. శనివారం కోసువారిపల్లె గ్రామం సీకే దయ్యాలవారిపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 77 పశువులకు గాలికుంటు టీకాలు, బూటాక్స్ పిచికారీ, 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 32 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. అనంతరం పాడి రైతులకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. అంబులెన్సు వెటర్నరీ వైద్యురాలు ఇందు, జేవీఓ శ్రీనాథ్, సిబ్బంది పూర్ణిమ, జనార్ధన్, శివానాయక్ పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఫోర్డు సభ్యులు, ఉపాధ్యాయ బృందం

పెద్దమండ్యం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) బాలికలు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని ఎస్ఓ రాణికుమారి, ఫోర్డు సంస్థ కోఆర్డినేటర్ నరసింహులు పిలుపు నిచ్చారు. సిద్దవరం కస్తూర్బా పాఠశాలలో ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. విద్యావంతులు తమ వంతుగా బాలల హక్కులను వారికి అవగాహన కల్పించాలన్నారు. బాలికల విద్యకు అందరూ కృషి చేయాలన్నారు. బాలికల పట్ల ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రుల తెలియజేయాలన్నారు. సంస్థ ద్వారా బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. ఫోర్డు సంస్థ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మదనపల్లె టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సీటీఎం, కొత్తవారిపల్లె గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎస్పీడీసీఎల్ ఏఈ కె.రమేశ్ తెలిపారు. సబ్స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా వుండదన్నారు. ఈనెల 16న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య మదనపల్లె డివిజన్ పర్యటన వున్న నేపథ్యంలో డివిజన్లోని అన్ని సబ్స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నట్లు సమాచారం.